శ్రీ రామ.

# Supplement to this issue of Bhakti sanjivani 1933.

## స్నేహిత విహిత విజ్ఞప్తి

**ద్వితీయము.**

**గీ ॥ శంకరుండు శ్రీవైష్ణవ సత్తముండు**
**రామనామైక చింతా పరాయణుండు**
**చయనులకు ఋజుబుద్ధియు, సత్యరక్తి**
**స్వగురు సూక్తిని భక్తి నొసంగుఁగాక ! ॥**

**గీ ॥ బోద్ధలగువారు కౌటిల్య పూర్ణమతులు**
**స్వార్థ చింతాభిరతులు మతాధిపతులు**
**ఇతర మరుజు లబోధోపహతులుగాన**
**శుష్క వేదాంతినాస్తికస్తోమ మెసఁగె ॥**

**గీ ॥ వికటవేదాంతి రాక్షసా విష్టమతులు**
**గాక, స్వాచార్య చోదిత కర్మగతులఁ**
**సతము భక్తిఁ బ్రపత్తి స్వధర్మమూను**
**వైదికుల కెల్లఁ బదివేల వందనములు ॥**

**గీ ॥ స్వగురు శాసనమును గృష్ణవఱదఁ గలిపి**
**యనధికారులు దామయ్యు ననధికారి**
**తతికిఁ దత్త్వమటంచు మిథ్యలు వచించు**
**వెఱ్ఱి వేదాంతులకు నిది వేరువిత్తు ॥**

భక్తిసంజీవని శ్రీశంకరచార్యులను, వారి యద్వైత వాదమునకు దూషించుచు ఖండించు చున్నదని దానియందు దోష మరోపించి శ్రీచయనులవారు "హితభోధ" యను పేర నిష్కారణముగ నొకకలహ పత్రికఁ బ్రకటించి యాంధ్రలోకమునఁ బ్రచురపడఁజేసిరి. దానికిఁ బ్రత్యుత్తరముగ భక్తి సంజీవని.

(1) మీరు సంజీవనులఁ బఠించి వ్రాసితిరా? పఠింపక వ్రాసితిరా? యనియు

(2) సంజీవని శంకరాచార్యులను దూషింపనులేదు. అద్వైతవాదమును ఖండింపనులేదు. ప్రవృత్తి మార్గమందుండు మీరును, మీవంటివారును వేదాంతమహావాక్యముల బోధించుట జీవనాధారముగను ధనార్జనోపాయముగను నుంచుకొని యున్నారుగదా, శంకరమత ప్రకారము మీరు చెప్పుటకుఁగాని, మీవంటి వారేయగు సంసారిమార్గస్థులును మీరును శ్రవణాదులు చేయుటకుఁగాని యధికారముగలదా? కలదేని వారి ప్రమాణవాక్యములఁదెలుపుఁడు. లేదేని యేల గురుశాసనము నుల్లంఘించి యిట్టి దుష్టచేష్టలచు లోకహాని కావించుచున్నారని ప్రశ్నించుచు, స్నేహిత విహిత విజ్ఞప్తియని వ్యాసమును బ్రకటించెను. వీరికిట్టి యధికారము లేదనుటకుఁ బ్రమాణవాక్యములను సంజీవని 1933 ఏప్రెల్, మే, జూన్ నెలల సంచికలందుఁ బ్రకటించెను.

బ్రహ్మవిచారము సత్కార్యమేకదా, ఎవరి కెవరుచెప్పిన సంజీవనికి రాఁగల నష్టియేమి. ఏలదాని నధిక్షేపింపవలె నని కొందఱు సందేహింపవచ్చును.

ఈ శుష్కవేదాంతులు ప్రపంచము మిథ్యయని నిర్గుణ బ్రహ్మోపాసనమే శ్రేష్ఠమని, భక్తిమత మధమ మని బోధించుచున్నారు. ఈ విచారము పరమహంస పరివ్రాజకులకు మాత్రమే తగినదని సంసారులకది విషయముగాదని సంసారులట్లు చేసిరేని వారు నాస్తికులు, అంత్యజులు, మూఢులనియును నట్లుచేయువారి నాలుక తెగఁగోయవలయు ననియు నద్వైత గ్రంథములే యిట్లు చెప్పుచున్నవి.

**" సంసారజ సుఖాసక్తం, బ్రహ్మజ్ఞో స్మీతివాదినమ్**
**కర్మబ్రహ్మో భయభ్రష్టం, తం త్యజే దంత్యజంయథా** గారుడ. **1-64.**
**అకృత్వావృత్తివిలయ, మజ్ఞాత్వా బ్రహ్మకేవలమ్**

**అహంబ్రహ్మేతి యో బ్రూతే, తస్యజిహ్వాంవికర్తయేత్".**
**అహం బ్రహ్మాస్మి కర్తాచ, భోక్తా చాస్మీతి యేవిదుః**
**తేనష్టా జ్ఞాన కర్మాభ్యాం, నాస్తి కాస్స్యుర్నసంశయః ॥**

శంకరాచార్యుల యుపదేశసాహస్రి.

**"ఎందాఁక జీవుండు స్వతంత్రుండైన యీశ్వరుండు గాకుండు నంతతడవు నంగన యిది పురుషుండు నే ననియెడి బుద్ధిమానుట కర్తవ్యంబుగాదు బ్రహ్మచారి యతిగృహస్థులందెవ్వఁడైనఁజిత్తంబు పరిపక్వంబు గాక యద్వైతాను సంధానంబుచేసిన మూఢుండగు."** భాగవంతము 7వ స్కంధము.

ఈ శాసనమును శుష్కవేదాంతు లుల్లంఘించి తామనధికారులయ్యు ననధికారులకు మీఁదఁజెప్పిన ప్రకారము జగత్తు మిథ్య–నేనే బ్రహ్మము నీవేబ్రహ్మము అని తన్నుఁదాను జూచుకొనుట శ్రేష్ఠమని భక్తి హీన మని బోధించుటచే నజ్ఞులగు పురుషులేకాక దేనికిఁ గొఱగాని కొందఱు ముండలు కూడ భజనపరులు హీనులని వారి నపహసించుచు, మాకు దేవాలయముల తోను నారాధనము తోను బనిలేదనియు మమ్ము మేము చూచుకొనుచున్నా మనియుఁ దాము శ్రేష్ఠలమనియు సోహం, తత్త్వమసి యభ్యసించుచున్నా మనియుఁ బ్రతిష్ఠలు చెప్పుకొనుచు నెత్తిమీఁద ముసుగులునిలువక యెగిరిపడుచు, గృహిణులకుఁగూడ దుర్బోధములుచేసి సంసారములఁ జెఱుచుచున్నారు. ఇది యాంధ్రలోకమునకు సువ్యక్తము. ఈ దుష్టకార్యమును నివారించు ప్రభువులేఁడు, వారింప శక్తిగల మఠాధిపతులు తటస్థులై తమవరుంబడియందు మాత్రము దృష్టిగలవారై యూరకున్నారు. వాస్తవవిషయము లోకమునకుఁ దెలిపిన కొందఱుగాకుండినఁ గొందఱైన ఈగోముఖ వ్యాఘ్రములవాతఁ బడకుందురను తలంపుతో భక్తిసంజీవని యీ వాదమునకుఁ గడఁగవలసి వచ్చెను. ఇది యకార్యమో సత్కార్యమో విమర్శింప వివేకులు సమర్థులు. స్నేహిత విహిత విజ్ఞప్తికిఁ బ్రత్యుత్తరముగ శ్రీచయనులవారు హితబోధ ద్వితీయమని పత్రిక మరలఁ బ్రకటించిరి. అందలి వ్యర్థవాక్యములను వదలి వారిచిత్తవృత్తియు, వృత్తము, వాద చమత్కారము దెలుపువాక్యములకు సంజీవని బదులిడుచున్నది.

1. సంజీవనుల మీరుచదివితిరా? యనిన ప్రశ్నకుఁ బ్రత్యుత్తరముగ **"భక్తిసంజీవని యన్నిసంచికలను సమగ్రహముగా నేను జదువలేదు. 33వ సం॥ జనవరినెల సంచిక మాత్రము చదివితిని"** బదులువ్రాసిరి.

పత్రికలు చదువకయే స్వోహాపోహములచే విమర్శించు విమర్శకుల నడవడి కేమనవలయును?

2. **"ఈ వాకములనుబట్టి శాంకర సిద్ధాంతమందు భక్తియను సాధనము లేదనికదా వీరియభిప్రాయ మూహింపవలెను"** అని వ్రాసిరి.

గ్రంథము చదువక తమకుఁ దోఁచిన ట్లూహించి వ్రాయువారి వ్రాఁత లిట్టివే కదా. శాంకరసిద్ధాంత మందే భక్తిలేదని సంజీవని వ్రాయలేదు. శంకరమతమునఁ బ్రవృత్తి మార్గస్థులకు భక్తి ప్రపత్తులే గతియని శంకరులు చెప్పిరని సంజీవని స్పష్టముగఁ బలుమాఱు వ్రాసెను.

కరపత్రములను బ్రకటించెను. శుద్ధాద్వైత జ్ఞాననిష్ఠయందు భక్తికవకాశములేదని వ్రాసెను. దీనిని చయనులవా రంగీకరించి **"తత్త్వసాక్షాత్కార వంతులకుఁ గర్మముల తోడను బనిలేదు భక్తితోడను బనిలేదు"** అని 5వ పుటయందుఁ గడపట వ్రాసిరి.

ఈమాట సంజీవని చెప్పినఁ దప్పు, చయనులవారు చెప్పిన నొప్పు. కోడలు బిచ్చములేదనిన దెప్పు, అత్తలేదనిన మెప్పు.

3. స్వస్వవర్ణాశ్రమోచిత కర్మముల మానినను భక్తుఁడగునేని దరించుననికదా వీరి భావము" అని చయనుల వారు తమబుద్ధిబలముకొలఁది నపోహములు వ్రాసిరి.

శ్రీ చయనులవంటి పండితప్రవరు లింతటి గ్రుడ్డి వ్రాఁతలు వ్రాయుదురని సంజీవని కలయందైనఁ దలఁచినది కాదు. స్వస్వవర్ణాశ్రమోచిత కర్మముల మానినవాఁడు భక్తుఁ డేనాఁడను గాఁడు. అట్టివాదమును సంజీవని ఖండించియున్నది. అట్టివాఁడు దొంగభక్తుఁడు. వాఁడు భ్రష్టుఁడే కాని వానియందు భక్తుఁడను నామము లవమైన నన్వయింపదు. ద్వైతానుష్ఠానమందు మునిఁగియుఁదా నద్వైతి ననుకొనువాఁ డెట్టివాఁడో వీఁడును నట్టివాఁడే. సంజీవని పత్రిక చూడుఁడు. ఈవిధముగఁ బలుతావుల సంజీవని వ్రాసియున్నది. కరపత్రములు ప్రకటించియున్నది. ఆ ప్రయాణము కర్మ మాచరింపవలయు నను మతమునకు సంజీవని చేరినదిగాని కర్మస్వరూపత్యాగము బోధించు కర్మ భ్రష్ట మతమునకుఁ జేరినదికాదు.

4. **"ఇట్టిపురాణముల నమ్మక యియ్యాని (శ్రీశైలము, అమరావతి) బౌద్ధాలయములని నవనాగరకుల**

**ననుకరించుచు వ్రాయుట యజ్ఞానమూలము"** అని వ్రాసిరి.

తల్లిని బట్టెడి వానికిఁ బిన్నతల్లి....ముతో సమానమన్నట్లు వేదములు మిథ్యలను అద్వైతి వైదికులకుఁ బురాణములందుఁ బ్రమాణబుద్ధిలేదు గాని సంజీవనికి లేకపోలేదు. ఆంధ్రసూత్రభాష్యమని శంకరభాష్యము నకుఁ దెనుఁగువ్రాసినవా రేమివ్రాసిరో చూడుఁడు "ఈనియమముచేత వైదికులకు భిన్నాత్మ శాస్త్రమునం బ్రవృత్తిగాని పురాణాదులకుం బ్రాధాన్యముగాని కూడదని నిరసింపఁ బడుచున్నది." (ప్ర. సం. 2వ పుట.)

చరిత్రకారులు వ్రాసినదాని ననుసరించి సంజీవని వ్రాసెను. పురాణకాలమునందు క్షేత్రములందు శివభక్తులు ఋషీశ్వరు లుండవచ్చును. ఆవల దానిని బౌద్ధులాక్రమించి యాలయములు నిర్మించిరి. ఇప్పు డుండు కట్టడములు ఋషులు పురాణకాలమందు నిర్మించిరని శ్రీచయనులవారు చెప్పఁ గలరా? దక్షిణ దేశ యాత్రచేసినవారు శివాలయములని తోఁచు దేవళములందు విష్ణువిగ్రహము లర్పింపఁ బడుటయు, విష్ణ్వాలయములందు శివుఁడారాధింపఁ బడుటయు నెఱుఁగుదురు. జగన్నాథము, వరాహ నారసింహ క్షత్రము లందలియాలయములు బౌద్ధులవికావా? కావనుటకు వీరికి నోరురాఁగలదా?

ప్రపంచము మిథ్య, వేదములు మిథ్యయని లోకులకు బోధించు శుష్కవేదాంతి చక్రవర్తులు తమకు ముఖ్యప్రమాణములుగా నీ పురాణములు నాధారముగఁ గొనుట చిత్రము. ఏటిలోఁ గొట్టుకొని పోవువాఁడు ప్రాణరక్షణకై గడ్డిపోఁచను బట్టుకొనునుగదా.

5. **"బౌద్ధులకు వెనుకవచ్చిన శంకరాచార్యుల వారు సన్న్యాసమునకుఁ బ్రాముఖ్యమిచ్చి భక్తిగాణముగా బోధించిరి" అను సంజీవనివాక్యముపై "స్మృతులును సన్న్యాస మునకుఁ బ్రాముఖ్యమిచ్చియుండఁగా బౌద్ధులకు వెనుకవచ్చిన శంకరాచార్యులవారు సన్న్యాసమునకుఁ బ్రాముఖ్య మిచ్చిరనుట"** యసంగతమని శ్రీచయనుల వారు వ్రాసిరి. బౌద్ధులకు వెనుక వచ్చిన శంకరాచార్యులవారని సంజీవని వ్రాసెనని యాక్షేపించిరిగదా, బౌద్ధులు ముందుటివారా? శంకరులు ముందటివారా?

అజ్ఞులు కర్ములు నెటువంటి యోగిశ్రేష్ఠులయి భగవత్కర్మపరులయినను వారుత్తరోత్తర హీనములయి ఫలత్యాగముతో ముగియు సాధనములు గలవా రగుదురనియు, పరమహంస పరివ్రాజకులకు మాత్రమే యనిష్టాది కర్మఫలత్రయము గలుగదనియు, అజ్ఞులు, కర్ములు, సన్న్యాసులు గానివారు, నగువారికి కర్మఫల త్రయము కలుగునని శంకరాచార్యులవారు వ్రాసిరిగదా. భ. గీ. 18-18 వ్యా. ఇది భక్తికిఁ బ్రాధాన్యమిచ్చినట్లా?

భక్తులకు బ్రహ్మలోక ప్రాప్తియనియు, సన్న్యాసులకు మోక్షమనియు శంకరులు వ్రాసినపుడు భక్తికిఁ బ్రాధాన్యమిచ్చినట్లా? సన్న్యాసమునకుఁ బ్రాధాన్యమిచ్చినట్లా? శ్రీచయనులవారే భక్తిజ్ఞానమున కంగమని వ్రాసిరికదా. అంగి ప్రధానమా? అంగము ప్రధానము? చయనులవారు సెలవిత్తురుగాక!

తైత్తిరీయోపనిషత్తు- ఆనందవల్లి సప్తమానువాకమున శంకర భాష్యమునకుఁటీకవ్రాసిన యానందగిరి **"దాసోహం తస్య దేవస్య మమారాధ్యః పరమేశ్వర ఇతిభేదం విద్వా కథమజ్ఞ ఇత్యుచ్యతే తత్రాహ (అసౌయోయమితి) యథా చంద్రభేదం పశ్య న్నవిద్వానుచ్యతే అతత్త్వ దర్శిత్వాత్"** పరమేశ్వరుఁడు నాకారాధ్యుఁడు ఆయనకు నేను దాసుఁడ ననువాఁ డజ్ఞుఁడని వ్రాసెనుగదా ఇది భక్తికిఁ బ్రాధాన్యమిచ్చినట్లా? భ. గీ. 18-68. వ్యాఖ్యాయందు శంకరులు **"భక్తింమయిపరాంకృత్వా = "భగవతః పరమగురోః అచ్యుతస్య శుశ్రూషామయాక్రియతే" ఇత్యేవంకృత్వాఇత్యర్థః తస్యేదం ఫలం, మామైవేష్యతి ముచ్యతే ఏవ అసంశయః = అత్రసంశయం నకర్తవ్యః ॥ భగవంతుఁడగు పరమగురునకు నచ్యుతునకు వాచే శూశ్రుష చేయఁ బడుచున్నది"** యని చేసియని యర్థము. దీని ఫలము మోక్షమే సందేమములేదు' అని వ్రాసిరికదా. ఇట్లు వ్రాయుటచేతను లక్ష్మీనృసింహుని నాపత్కాలమున ధ్యానించుటచేతను శంకరులు నజ్ఞకోటిలోఁ జేరినవారే కదా. వీరువ్రాసిన స్తోత్రము లజ్ఞత్వమును జాటింపదా. అజ్ఞులకైనను అజ్ఞమార్గము బోధించుగురు వేటిగురువు?

చయనులవా రుదాహరించిన **"బ్రాహ్మణో నిర్వేద' "బ్రాహ్మణా పుత్రైషణా"** యను శ్రుతులు సన్న్యాసము నకు ననుమతి యిచ్చుచున్నవికాని యదిశ్రేష్ఠమని చెప్పలేదు. అన్ని యాశ్రమములలో గృహస్థాశ్రమమే శ్రేష్ఠ మని పరశ్శత ప్రమాణములు గలవు. వేలకొలఁది పౌరాణిక ఋషీశ్వరులలో సన్న్యాసులెందఱున్నారో చయనుల వారు తెలిపెదరుగాక.

**"సన్న్యాస యోగయుక్తాత్మా విముక్తో మాముపైష్యసి"**

యను భగవద్గీతా వాక్యమునందలి సన్న్యాస శబ్దమున కర్థము శ్రీకృష్ణభగవానులే **"కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయోవిదుః"** కామ్యకర్మములు చేయకుండుటయే సన్న్యాసమని సెలవిచ్చిరిగాని బోడులై కాషాయ వస్త్రములు కమండలువు ధరించువాఁడే సన్న్యాసియని భగవద్గీతయం దెందును జెప్పలేదు. అది లక్షణా వృత్తిచేతను,

అధ్యాహారముల చేతను, కాకువులచేతను సాధింపవలసి యున్నది గాని ఋజుమార్గ మునఁగాదు. జ్ఞానము సన్న్యాసలక్షణము. అది యుండెనేని వేషమేదియున్నను దోషముగాదు. సర్వధర్మా॰ పరిత్యజ్య యనుటకు భగవదభిప్రాయమునకు విరుద్ధముగ సన్న్యాసపరముగ శంకరులు వ్యాఖ్యానించిననునది సరిగాదని భగవదభిప్రాయమునకు విరుద్ధమని కీర్తిశేషులైన బాలగంగాధర తిలకుగారు "అన్నివిధములగు ధర్మములను (అనఁగా పరమేశ్వర ప్రాప్తి సాధనముల నని టిని) వదలి నన్నొక్కనినే శరణు పొందుము నేను నిన్ను సర్వపాపముల నుండియు విముక్తునిఁగఁ జేయుదును' అని గీతారహస్యము 560వ పుటయందు వ్రాసిరి భగవద్గీత సన్న్యాసమును బోధింపదని వారు వ్రాసినదానికంటె విశేషించి యెవ్వరును వ్రాయఁజాలరు. అది నిరుత్తరము.

శ్రీచయనులవారు శివగీతలను దమకుఁ బ్రమాణముగ గ్రహించిరికదా. అందు భగవద్గీతలలోని యనేక శ్లోకములనువదింపఁ బడినవికదా. వానిలో **"సర్వధర్మా॰ పరిత్యజ్య"** యనునది యొకటిగదా. దానికి ముందు "తతస్సర్వం పరిత్యజ్య మద్భ క్తిం సముదాహర" కావున సర్వమువీడి మద్భక్తిని సంపాదించు అని కలదుకదా. అప్పుడు సర్వధర్మా॰ ' అను శ్లోకము సన్న్యాసమును విధించుచున్నదా? భక్తిని విధించు చున్నదా? శివగీత శంకరులకు ముందుపుట్టిన దేకదా. దాని కివిరుద్ధముగఁగదా శంకరులు వ్యాఖ్యానించిరి.

Prabuddha (Bharata, April 1933.)

Viewed Historically

Renunciation is the very soul of the Upanishads. Illumination born of discriminative reflection is the ultimate aim of Upanishadic Knowledge. My beleif, however, is that it was since the time of Buddha that monastic vow was preached more thoroughly all over India, and renunciation, the giving up of the sense -enjoyment, was recognised as the highest aim of religious life. And Hinduism has absorbed into itself Buddhistic spirit of renunciation. Never was a great man of such renunciation born in this world as Buddha.

The monastic institution was there (in India before the advent of Buddha), but the generality of people did not recognise it as the goal of life; there was no such staunch spirit for it, there was no such firmness in spiritual discrimination. So even when Buddha betook himself to so many yogis and sadhus, nowhere did he acquire the peace he wanted. And then to realise the highest he fell back on his own exertion, and on a spot with the famous words ఇహాసనే శుష్యతుమే శరీరమ్

"Let my body wither on this seat" etc) rose from it only after becoming the Buddha, the illuminated one. All the many Matts that you now see in India occupied by monks were once in the possession of Buddhism. The Hindus have only made them their own by modifying them in their own fashion. Really speaking, the institution of Sannyasa originated with Buddha, it was he who breathed life into the dead bones of this institution.

అర్థము.

ఉపనిషత్తుల ముఖ్యప్రాణమే సన్న్యాసము. ఆత్మానాత్మ విచారమువలనఁ గలిగిన చిత్తవికాసమే యుపనిషత్తులు బోధించు జ్ఞానమునకుఁబర మోద్దేశము. అయినను బుద్ధుని కాలము మొదలుకొనియే సన్న్యాసవ్రతము హిందూ దేశమునందంతట మిక్కిలి సమగ్రముగా బోధింపఁ బడినదనియు, సన్న్యాసమనఁగా విషయభోగ విరాగము మతానుష్ఠాన వర్తనమందు బరమోద్దేశముగా గ్రహింపఁ బడినదనియు నా నమ్మకము. మఱియు హిందూమతము సన్న్యాస విషయమైన బౌద్ధభావమును దనలో మగ్నము చేసికొనినది. ఈ ప్రపంచమందు బుద్ధునికంటె గొప్పసన్న్యాసి యేనాఁడును బుట్టలేదు. హిందూదేశమందు బుద్ధునికిముందే సన్న్యాసాశ్రమ ముండినది. అయినను సామాన్యముగ జనులు దానిని మతవిషయమైన పరమగతిగా భావించినవారుగారు. దానియం దింతయాగ్రహబుద్ధిలేదు. అధ్యాత్మిక వివేకమం దింతటి పట్టుదలయు లేదు. కావుననే బుద్ధుఁ డనేక యోగులయొద్దకు సాధువుల యొద్దకుఁ బోయినపుడు ఆయనకుఁ గావలసిన చిత్తశాంతి యెందును లభించినదికాదు. అటుపిమ్మట నుత్తమమగుదాని సాక్షాత్కరించుకొనుటకు స్వప్రయత్న ములమీఁదనే యాధారపడి "ఇహాసనే శుష్యతుమే శరీరమ్" నాదేహ మిందే శోషించిపోవును గాక యను ప్రసిద్ధవాక్కు లుచ్చరించి యొకచోటఁ గూర్చుండి బుద్ధుఁడైనపిమ్మటనే యందుండిలేచెను. ఇప్పుడు మీరు హిందూదేశమందు చూచు సన్న్యాసు లాక్రమించిన యనేక సర్వమతము లొకకాలమందు బుద్ధమతమువారి స్వాధీనమం దుండినవే. హిందువులు వానిని దమయిష్టపద్ధతి ప్రకారము మార్చుటమాత్రముచేతనే తమవిగాఁ జేసికొనిరి. వాస్తవముగా సన్న్యాసాశ్రమము బుద్ధునితో నుదయించినదనియే చెప్పవలసి యున్నది. ఆయననే యీ యాశ్రమము యొక్క చచ్చిన యెముకలకుఁ బ్రాణముపోసినవాఁడు. ప్రబుద్ధభారత. ఏప్రిల్. 1933.

శ్రీచయనులవా రెంత ధనార్జనైక తాను లయినను వివేకానంద స్వాములవారి పేరు వినియైన నుందురు. మీఁద ననువదించిన వారివాక్యములు శిరసావహించి సంజీవనిని దూషింపక యూరకుందురో, మధ్యవర్తుల మాటలువిని వారినిగూడ దూషించెదరో పరికింప నాంధ్రలోక ముత్కంఠ వహించియున్నది. మనదేశమున బౌద్ధమతము రూపుమాయుటకు నీ సన్న్యాసమే కారణమని వజ్రయాన మతము గుఱించి వ్రాసినపుడు సంజీవని వ్రాసియున్నది. అట్టిదే దాని వెనువెంట వచ్చుటచే నంధ్రదేశమున భక్తికెడము లేదయ్యెను.

అప్పటిమాటలేల? ఇప్పటికిని సన్న్యాసము పుచ్చుకొనినంత మాత్రమున నావల వారు విధులఁ బాటింప కున్నను, ఇంటింట దినదినము తమకు గారెలు బూరెలు పరమాన్నము లడ్డులతోడ భిక్షపెట్టి తమవ్రతము నాశముచేసి తమ్ము వ్రాత్యులఁజేసిన గృహస్థులకుఁ దమ పాపమును పంచిపెట్టుచున్నను, విశ్వరూప దర్శనమను పేర దమగుడ్డలువిప్పి స్త్రీలకు మర్మాంగ దర్శనము చేయించి వారిమగవారిచే చెప్పుదెబ్బలు దినుచున్నను, పగలు వంటకు రాత్రి జంటకు సహాయురాండ్రుగా విధవల నుంచికొనినను, మధ్యాహ్నము పూరీలుచేసి ఫలాహారము పెట్టలేదని ప్రియురాలి వీఁపు బ్రద్దలు చేసినను మరలఁ దానింటికి వచ్చెదనని మధ్యవర్తులగు వైదికులచే భార్యకుఁ జెప్పిపంపి విధవలఁ జెఱిచి నీవు చెడినదిగాక నన్ను జెఱుపఁ జూచెదవా రావలదని యామె చెప్పిపంపినను, సిగ్గులేక బహిరంగముగ నిందఱు ముండలు నాయొద్దకు వచ్చుచున్నా రే నాముండరాలేదే యని యేడ్చుచున్నను, శిష్యునితో నీదేమి భక్తి నీబొందభక్తి. ఇంతభక్తి గలవాఁడవు నీ పెండ్లామును నా యొద్ద నొకనాఁడైనఁబండఁబెట్టితివా యనుచున్నను, సన్న్యాసి యైనంత మాత్రముననే మోక్షము గలదని తలఁచు మూఢగృహస్థు లెందఱోకలరు. ఈ వేదాంత వాక్యములకు నంతరార్థము వేఱేకలదఁట. అది యొకతండ్రికిఁ బుట్టినవానికిఁ దెలియునదికాదు.

**సకేశీనాం వికేశినాం కాగతిః కమలోద్భవ**

**అహం సన్న్యాసిరూపేణ, ధర్షయిష్యామి నారద ॥**

అనఁగా నారదుఁ డొకనాఁడు బ్రహ్మనుజూచి తండ్రీ కాముకలగు సకేసులను వికేసులకు నేదిగతి యని యడిగెనఁట అప్పుడాయన నారదా నేను సన్న్యాసివేషమునఁ బుట్టి వారిచేఁ బ్రాజాపత్య క్రతువు చేయించుకొని వారికి నాసాయుజ్య మిచ్చెదనని చెప్పెనను నీ ప్రమాణవాక్యమును సవ్యాఖ్యానముగ నుదాహ రించుచు సన్న్యాసులమగు మేమనాథలనుద్ధరింపఁ బుట్టితిమి కావున మాసాయుజ్యము గోరువారురండని యొకఁడు బోధించునఁట.

అటైన సువాసినులఁగూడ నుద్ధరింపరాదా యని యొక శిష్యురా లడుగఁగా నీ పద్యము చదివెనఁట.

గీ. **కాళ్లఁ బసుపులేదు కనులఁగాటుకలేదు**
**గాజులేవి లేవు ఘల్లనంగ**
**కుంకుమంబు లేదు గుర్తింపఁగాఁ జేయ**
**రైకముళ్లు విచ్చు శ్రమములేదు**
**మెడల నగలులేవు మేను గ్రుచ్చికొనంగ**
**కాన యతియు విధవఁ గాంక్షసేయు.**
**పూర్వపు సన్న్యాసి విభాగములు నేఁడరుదు.**
**బూతులసన్న్యాసులు, విశ్వరూపసన్న్యాసులు,**
**కాఫీహోటల్ సన్న్యాసులు, గారెల సన్న్యాసులు,**
**అత్తరుబుడ్ల సన్న్యాసులు, దున్నపోతు సన్న్యాసులు,**
**అష్టమహిషీ సన్న్యాసులు, బులాకిసన్న్యాసులు**

నను ననేక భేదములు నేఁడేర్పడుచున్నవి.

ఈ శుష్కవేదాంతుల వలనను, దొంగ సన్న్యాసుల వలనను మన యాంధ్రదేశము పాడగుచున్నది.

6. "**అద్వైత బ్రహ్మనిష్ఠయనఁగా గదలక మెదలక శవమువలె నుండుటయని వీరుగ్రహించిరి కాఁబోలు**" అని యాక్షేపించి "**సప్తభూమికా స్థితులకు జగత్స్ఫురణముండక పోవచ్చును. బ్రహ్మ సాక్షాత్కారానంతరము కూడఁ బ్రారబ్ధవశమున ద్వైతము స్ఫురించును**" అని చయనులవారు వ్రాసిరి.

జగత్స్ఫురణములేని సప్తమభూమికాస్థితునకు శవమునకు భేదమెమో చయనులవా రెఱిఁగింతురు గాక! సప్తమభూమికాస్థితుఁడు జీవచ్ఛవమని, శవము నిర్జీవమని భేదము చెప్పుదురు కాఁబోలు. సంజీవని చెప్పినది యుత్తమునిస్థితియే కాని యధముని స్థితిగాదు. బ్రహ్మసాక్షాత్కారమైన వానికిఁ గూడఁ బ్రారబ్ధవశమున ద్వైతము

స్ఫురించునఁట. ప్రారబ్ధము దేహముతోఁగాని పోదు. కావున ద్వైతము దేహముండు వఱకుండును గదా, ద్వైతస్ఫురణ గలవానికి శంకరమత ప్రకారము మోక్షముగలదా? ఈస్ఫురణ యున్నప్పుడు "ప్రారబ్ధప్రతి భాసనాశ పర్యంతం స్వరూపానుసంధా నేన వసేత్" అని మహావాక్యరత్నావళి చెప్పినట్లు జపమో తపమో స్వధర్మానుసారముగ స్వరూపసంధానము కావించుచుండవలయునా? విధవాలోక సంగ్రహార్థము స్వాధ్యాయ సంధానమునకై పరువెత్తవలయునా? దేహమున్నంతవఱకుఁ బ్రకృతిసాంగత్య బలమునఁ బరిపూర్ణ బ్రహ్మసాక్షాత్కారములేదు. దేహమువిడిచినవాఁడా బ్రహ్మమెట్టిదో వచ్చి చెప్పఁడు.

7, "ప్రవృత్తి మార్గనిష్ఠులై కామినీ కాంచనా సక్తులై ధనార్జనైక త్వరులైన మీకును, మీయట్టి శుష్క వేదాంతులకును, బ్రహ్మవిచారమందుగాని యితరుల కావిషయ ముపదేశించుటకుఁగాని యధికారము గలదా? యని సంజీవని శ్రీచయనులవారిని బ్రశ్నించెను. దానికిఁ బ్రత్యుత్తరముగ "సన్న్యస్యశ్రవణంకుర్యాత్" (4వ పుట. 9వ బంతి) సన్న్యసించి శ్రవణము చేయవలయును. అనియు,

"అద్వైతసిద్ధాంత ప్రామాణ్యము గలవారలు కూడఁ బ్రవృత్తి మార్గాసక్తులైరేని శ్రుతి స్మృతి పురాణో దితకర్మముల నాచరించి భగవదర్పణముచేసి భక్తులగుచుఁ జిత్తశుద్ధిగాంచి క్రమముగాఁ దరింతురు.

నివృత్తి మార్గాసక్తులై రేని గురుదేవతా భక్తులగుచు శ్రవణ మనన నిధి ధ్యానములుచేసి తత్త్వ సాక్షాత్కారము గలవారలై ముక్తులగుదురు. తత్త్వసాక్షాత్కార వంతులకుఁ గర్మములతోడను బనిలేదు, భక్తితోడను బనిలేదు" అని వ్రాసిరి.

సంజీవని చెప్పినదానికి నీవాక్యములకు భేదము గలదేమో పాఠకులు విమర్శింతురుగాక! ప్రవృత్తి మార్గాసక్తులకు భక్తియని, నివృత్తిమార్గాసక్తులకు శ్రవణ మననాదులని వ్రాసిరికదా. భార్యాపుత్రులుగలవారై దారైషణ ధనైషణ పుత్రైషణ వదలక యేఁబదిరూప్యములు చాలవని నూఱురూపాయలు బేరమాడి బ్రహ్మ తత్త్వము బోధించుచు "డబ్బులీయనిముండలుముందుగావచ్చికూర్చుండెదరని" వినవచ్చిన స్త్రీలపైఁ గోపించుచు "వేదవిక్రయులగుదురు విప్రవరులు, పణ్యయోనులునగుదురు పద్మముఖులు, కష్టతరమైన యక్కలి కాలమునను" అను పంచమ వేదవాక్యమును స్థాపించు శ్రీచయనులవారు ప్రవృత్తిమార్గనిష్ఠులా? నివృత్తి మార్గనిష్ఠులా? నివృత్తి మార్గనిష్ఠులు కారేని వీరివాక్యము ప్రకారము శ్రవణ మనవాదులందు వీరి కధికార మెందుండివచ్చెను? నివృత్తి మార్గని ష్ఠులమందురేని "సర్వకర్మసన్న్యాసేనైవ జ్ఞాననిష్ఠాకార్యా" "సర్వకర్మ సన్న్యాస పూర్వకాత్మనిష్ఠా" సమస్తకర్మములువదలి సన్న్యాసియై జ్ఞాననిష్ఠుఁడు కావలయునని శంకరులు గీతావ్యాఖ్యాన మందుఁ బలుతావులను "అథాతో" వ్యాఖ్యయందును ఉపదేశ సాహస్రీ త్యాదులందును ఐత్తిరీయ భాష్యపీఠిక యందును వ్రాసియుండఁగా వీరు సన్న్యాసులుగాక ధనైకదాసులై యెట్లు బ్రహ్మవిచారము చేయుచున్నారు? వీరి యుపన్యాసమును వినుటకు నూర్లు నూర్లిచ్చువారు అథాతో, వ్యాఖ్యవిని మనకు దీనియం దధికారము లేదని యడిగిన వివేకిలేఁడు గదా?

ఇట్లు తాముచేయునది తప్పు. సంజీవని వ్రాసినది యొప్పని వ్యంగముగ నంగీకారము సూచించియు, స్పష్టముగ నంగీకరించిన తమ గౌరవమునకుఁ బండిత ప్రవరత్వముకు వ్యాఖ్యాన వాచస్పతిత్వమునకుఁ బుష్పగిరి శాంకర పీఠమునకు నగౌరవము వచ్చునని కాఁబోలు, లేక వారువ్రాసిన ప్రకారము "పూర్వాపర విమర్శశూన్యతనో యజ్ఞానముననో లోకవంచనము కొఱకో"

"యాజ్ఞవల్క్య మహర్షి జనకునకు "అహం బ్రహ్మాస్మి యనుకొనుమని యుపదేశించెను. శ్వేతకేతువు నకు తత్త్వమసియని యుద్దాలకమహర్షి యుపదేశించెను. ఈ గురుశిష్యులిరువురును సన్న్యాసులుకారు" అని స్వోక్తి వ్యాఘాతముగ వ్రాసిరి.

గురు శిష్యులిరువురు సన్న్యాసులుకారు. కర్మయోగులనుట సంజీవని యంగీకరించుచున్నది. కావున గృహస్థులకుఁ బ్రవృత్తి మార్గనిష్ఠులకు అహం బ్రహ్మాస్మి తత్త్వమసియని గృహస్థులుపదేశింపవచ్చు ననికదా చయనులవారి వాదము. అనఁగాఁ గర్మసముచ్చయ వాదమును శంకరాభిప్రాయమునకు విరుద్ధముగా వీరంగీకరించిరి కదా.

(1) ఈ వాక్యములు శంకరాచార్యులవారికిఁ దెలియునా తెలియవా?

(2) తెలియవందురా, శంకరాచార్యులుపనిషత్తులు చదువకయే వానికి వ్యాఖ్యానమెట్లువ్రాసిరి? వారును గ్రంథము చదువక యాక్షేపించు చయనులవంటివారా?

(3) చదివిరని యందురేని, యెట్లు దీనికివిరుద్ధముగ సర్వకర్మములువదలి పరమహంసలై సాధన చతుష్టయ సంపత్తిగల వారుగాని జ్ఞానమార్గనిష్ఠులు కాఁగూడదని శాసించిరి?

(4) మీఁది యుదాహరణములు కర్మసముచ్చయ వాదమును బలపఱిచి శంకరులవాదమును

ఖండించుచున్నవా లేదా?

(5) "కర్మణైవహిసంసిద్ధి మాస్థితా జనకాదయ" యను శ్లోకమునకు శంకరులేమి వ్యాఖ్యవ్రాసిరి? తపసోవాప్యలింగాత్తనుచో నేమివ్రాసిరి?

(6) శ్రీచయనులవారి వ్రాత సత్యమయ్యెనా శంకరాచార్య మతము నిర్మూలమగుచున్నది. శంకర మతము సత్యమయ్యెనా శ్రీచయనులవారి వ్రాత, వారి వితండావాద పటుత్వమును స్థాపించుచున్నది. మఱియొక చిత్రముచూడుఁడు. మీఁదివాక్యమున కుపబలముగ.

"దృష్టార్థాహి విద్యా ప్రతిషేథా భావమాత్రేణాప్యర్థిన మధికరోతి శ్రవణాదిషు" అని శ్రీశంకరులు సూత్రభాష్యమున వ్రాసిరి" యని వాక్యరత్నము నొక దానిని లిఖించిరి.

ఇట్టివారుగదా పుష్పగిరి మతమున నాస్థాన విద్వాంసులు. ఏమి యా మతమునదృష్టము.

ఇందు నర్థులకు శ్రవణాదులం దధికారము గలదని శంకరులు వ్రాసిరికదా చయనులవారి వాదము. ఈ యర్థులెట్టివారని శంకరులు చెప్పిరి?

"ముముక్షూణాం, శ్రద్దధానానా, మర్థినా, మర్థాయ" యని వారుపదేశ సాహస్రియందుఁ జెప్పిరి.

అనఁగా ముముక్షువులై, శ్రద్ధగలవారైన, యర్థులకని దీనియర్థము. ముముక్షువు లెట్టివారని వ్యాఖ్యాత లు వ్రాసిరో చూడుఁడు.

"ముముక్షూణామితి = ముముక్షూణాం = మోక్షమాత్ర మిచ్ఛ తామితి. అనేన ఐహికాముష్మి కార్థ తృష్ణాలేశవ తామప్యత్రాౖ నధికార ఇతిసూచితమ్"

అనఁగా ముముక్షువులనఁగా మోక్షమునందు మాత్రమే యిచ్ఛగలవారు. ఇట్లనుటచే నైహిక ప్రయోజన ములందుఁగాని యాముష్మిక ప్రయోజనములందుఁగాని లేశమైన తృష్ణగలవానికి దీనియందధికారము లేదని సూచితము.

చయనులవా రిట్టివారా యని సంజీవని ప్రశ్నించుచున్నది. సాధన చతుష్టయమందు ముముక్షుత్వము కడపటిది. కావున నాలవది తక్కిన మూఁటికి నుపలక్షణము కావున నిచ్చట ముముక్షువుల కన్నప్పుడు సాధనచతుష్టయ సంపత్తిగలవారికనియే గ్రహింపవలయును.

తరువాత శ్రద్దధానానాం = అస్మి న్నుపదేశశాస్త్రార్థే విశ్వాసవతామితి. అనేనముముక్షవోపి సంతోయే కర్మసు అన్య శాస్త్రేష్వపివా శ్రద్దతే, తేషామిహానధికారః సూచ్యతే" శ్రద్ధావంతులనఁగా నీయుపదేశ శాస్త్రార్థమందు విశ్వాసముగలవారు. ఇట్లుచెప్పుటచే ముముక్షువులైనను కర్మముల యందుఁగాని, యితర శాస్త్రములందుఁ గాని శ్రద్ధగలవా రైరేని వారికి నధికారము లేదని సూచింపఁబడెను.

చయనులు మీఁదజెప్పినట్లు ముముక్షువులనియే వారి నడవడిఁబట్టి యంగీకరింతురా? కామినీ కాంచనార్జన శాస్త్రమందు దృఢవిశ్వాసము గలవారై యహర్నిశము దానికై శ్రమించి వేలకొలఁది నార్జించి యార్జించుచున్న వారు కావున వీరు నివృత్తిశాస్త్రమందు శ్రద్ధధానులగుదురా?

"అర్థినామ్ = ఏతచ్ఛాస్త్రార్థ జ్ఞానార్థినామితి– అనేన శ్రద్దధానా అపియేపాండిత్య విస్తర ప్రవణమతయః తేషా మిహానధికారో ధ్వనితః "

అనఁగా అర్థులనఁగా నీశాస్త్రార్థ జ్ఞానమందుఁ గోరిక కలవారు. ఇట్లు చెప్పుటచే శ్రద్ధగలవారైనను పాండిత్య విస్తర మందు ప్రీతిగల మనస్సుగలవారెవరో వారికి దీనియం దధికారము లేదని ధ్వని. పండిత ప్రవర బిరుదాంకితులిట్టివారా?

అద్వైత వ్యాఖ్యాతలే యిట్లువ్రాసియుండఁ జయనులవారు, దృష్టార్థాహి = చేతిలో ఘలుఘల్లని చూడఁ బడిన డబ్బుగలవారుగదా, విద్యాప్రతిషేధా భావమా త్రేణాపి = తమ శుష్క వేదాంత విద్య సరికాదని తిరస్కరించువాఁడు లేక పోయినంత మాత్రముచేతనే, అర్థినం = ధనికుని, శ్రవణాదిషు = శ్రవణమన నాదులందు, అధికరోతి = అధికారము కలవానిఁగా జేయుచున్నది.

అనఁగా శుష్క వేదాంతులారా! మీరు చేయునది తప్పని చెప్పువాఁడు లేకుండుటచే చేతిలో డబ్బు ఘల్ ఘల్ అని నూఱు రూపాయలు చప్పుడుచేయు ధనికులకు శ్రవణాదులం దధికారము గలదని యర్థమగు నట్లు దీనినుదాహరించిరి.

శంకరాచార్యులవారు నేఁటికిని జీవించి హిమాలయ మందున్నారని దివ్యజ్ఞాన సమాజమువారు వ్రాసి యున్నారు. అది నిజమగునేని వారొకనాఁడు విరామము గలిగించుకొని తమ వాక్యములకు తమ ప్రశిష్యులు

ధనదాసులగు శుష్క వేదాంతులు తమ వాక్యములకు చెప్పునర్థమును వినిపోయి రేని వారు నేత్రములం దుండి వేఁడినీరే కార్చెదరో! నిప్పులేరాల్చెదరో!!

ధనదాసులయిన చయనులవారు శంకర వాక్యమున దమ నిషిద్ధ దుష్కార్యమునకుఁ బ్రమాణముగా నుదాహరించుట వారి వాద దౌర్బల్యమును, వైతండికత్వమును జాటించుచున్నది. సమానాద్వైతపండితులు తమ్ముఁజూచి నవ్వుదురనియైన జంకక యిట్టి కుట్రవ్రాఁతలు వ్రాసిరికదా యని సంజీవని విచారపడుచున్నది. ఇట్టిపల్టీలకు, గారిడీ విద్యలకు మాయావాదములకు సంజీవని మోసపోదని చయనులవా రెఱుంగుదురు గాక!

వీరికిఁ దగిన ప్రాయశ్చిత్తము పుష్పగిరి మఠ స్వాములవారు పెట్టరేని వీరివలన పుష్పగిరి పీఠమునకు నపకీర్తివచ్చుట సత్యము. వీరి ప్రథమహితబోధచూచి మీరు మామతము పేరెత్తవలదని స్వాములవారు శాసించుటచేతనే తమ బిరుదములను రెండవ హితబోధయందు వదలిరఁట. అట్టులే లోక హితమునకై వీరి దుర్బోధములను మానుపుదురని స్వాములవారు ప్రార్థింపఁ బడుచున్నారు.

ప్రవృత్తి మార్గనిష్ఠులకు మహావాక్యార్థ విచారాదులలో నధికారము గలదా? యనువిషయమై శ్రీ కాంచీ కామకోటి పీఠాధిపతులగు జగద్గురు శ్రీశంకరాచార్య స్వాముల వారికి వ్రాయఁగా వారియొద్దనుండి వచ్చిన సమాధానము నీ క్రిందఁ బొందుపఱుచు చున్నాను.

**"ముఖాం- శేంగనూరు. 13-5-1933.**

ప్రవృత్తిమార్గనిష్ఠులకు మహావాక్యార్థ విచారాదులలో అధికారము గలదా? అనిన్ని శ్రీమదాచార్య భగవత్పాదుల వారికి కర్మసముచ్చయవాద మభిమతమేనా? అనిన్ని ఈ అంశములను కని తామంపుకొనిన విజ్ఞప్తి పత్రిక జేరి అందులోని యంశములు శ్రీవారికి సుసమయంబున శ్రుతమైనది.

ప్రవృత్తిమార్గనిష్ఠులకు మహావాక్యార్థ విచారాదులలో అధికారముకలదా? అను సంశయము సూత సంహిత యజ్ఞవైభవ ఖండము 2వ యధ్యాయము నున్ను తాత్పర్య దీపిక అనుదాని వాఖ్యానమునున్ను చదివితి రేని నివర్తికావచ్చు ననియూ కర్మసముచ్చయము మోక్షసాధన మనునది శ్రీమదాచార్యపాదులవారి అభిప్రాయము కాదనియూ ఈ అంశములను తమకుఁ దెలియజేయుమని శ్రీవారి సన్నిధానంలో ఆజ్ఞాపించిన ప్రకారం తెలియచేయడ మైనది."

సూతసంహిత- యజ్ఞవైభవఖండము 2వ అ.

శ్లో ॥ సర్వాధిష్ఠాన మీశానం పశ్యన్నేవ విముచ్యతే
ఈశాన విషయం జ్ఞానం వేదాంతశ్రవణాదినా ॥ **10.**

శ్లో ॥ జాయతే పరహంసస్య తస్యముఖ్యాధికారిణః
ఆశ్రమాంతర నిష్ఠస్య క్రమాత్తస్యాపి జాయతే ॥ **11.**

శ్లో ॥ బ్రహ్మలోక మవాప్నోతి వనస్థో నైష్ఠికోపిచ
గృహస్థః పితృలోకం శివాజ్ఞానంతు భిక్షుకః ॥ **12.**

శ్లో ॥ తత్రాపి ప్రథమో భిక్షు ర్జ్ఞానేచ్ఛోదయ బాధకాత్
మహాపాపాద యత్నేన ముచ్యతే మునిపుంగవాః ॥ **13.**

శ్లో ॥ ద్వితీయ శ్శాంతి దాంత్యాది, జ్ఞానాంగేచ్ఛా మవాప్ను
యాత్ । తృతీయోఖిల వేదాంత శ్రవణేచ్ఛా మవాప్ను
యాత్ ॥ **14.**

శ్లో ॥ చతుర్థో జ్ఞానమాప్నోతి వేదాంతశ్రవణేవతు
సఏవ కర్మ సన్న్యాసీ పరహంస సమాశ్రయః ॥ **15.**

వ్యాఖ్యానము.

సర్వాధిష్ఠానమితి ॥ ఉక్తస్య పరమపురుషార్థ జ్ఞానస్యకారణ మధికారిణంచాహు ॥ ఈశానవిషయే ॥ 10. 11.

క్రమాదిత్యుక్తం క్రమమేవాహ ॥ బ్రహ్మలెకమితి ॥ క్రమాను ప్రవిష్టస్యాపి పితృలోకస్య వనస్థత్వానంతర భావిగార్హస్థ్య ఫలత్వా దత్రోపన్యాసః శివజ్ఞానంతు భిక్షుక ఇతి సాక్షాత్పారంపర్యాభ్యా ॥12॥ చతుర్విధాహి భిక్షుకాః

– కుటీచక బహూదకహంస పరమహంసాః – తత్రాద్యస్య పారంపర్య ప్రకారమాహ ॥ తత్రాపి ప్రథమో భిక్షురితి ॥ జిజ్ఞాసా ప్రతిబంధక పాప నివృత్తిః కుటీచ కాశ్రమ ధర్మానుష్ఠానఫలం ॥13 ॥ బహూదక ధర్మానుష్ఠాన స్యతు శమ దమాది లాభఃఫలం ॥ హంస ధర్మస్యతు వేదాంత శుశ్రూషా ॥ 14 ॥ శ్రవణ పురస్సర తత్త్వ జ్ఞానావాప్తి శ్చతుర్థాశ్రమ ఫలమిత్యర్థః ॥15 ॥

శ్లో॥ సంసార నాశకంప్రోక్తం తమ సశ్చండభానువత్
అతో విజ్ఞానలాభాయ పరహంసో భవేద్విజాః ॥ **18.**

శ్లో॥ పూర్ణాహుతిం పునఃకుర్యుః ప్రణవే నాగ్ని జాయయా
సహాగ్నిం పునరాఘ్రాయ అయం తేయోని ఋత్విజః ॥ **23.**

శ్లో॥ ఇతిమం త్రేణ కుర్యుస్తే ప్రేషోచ్చారణ మాదరాత్
సన్యాసాధ్వర్యుణాదత్తం దండకాషాయ మేవచ ॥ **24.**

శ్లో॥ పరిగృహ్య గురోః పాదం ప్రణమ్య శ్రద్ధయాసహ
వే దాంత శ్రవణం కుర్యు ర్జ్ఞానార్థం భిక్షుకోత్తమాః ॥ **25.**

శ్లో॥ కామ్యకర్మ ఫలేదోషం విదిత్వా ప్రతిషిద్ధవత్
కామ్యకర్మ త్యజం స్తుత్యో భిక్షుణా ఫలతోభ వేత్ ॥

ఏనినిబట్టి చూచినను బ్రవృత్తిమార్గనిష్ఠులకు మహావాక్యార్థ విచారాదులలో నధికారములేదని స్పష్టపడు చున్నది.

ఈ విషయమైన విరూపాక్ష స్వాములవారి యభిప్రాయము రాఁగల సంజీవని ప్రకటింపఁగలదు. శాంకర పీఠాధిపతుల యభిప్రాయమిట్టిదై యుండఁ బుష్పగిరి పీఠసంస్థాన ప్రధాన పండితులిట్లు వ్రాయుట పీఠమున కపకీర్తి తెచ్చుటకే కదా? ఈ పీఠము బవిసి యింతమాత్రమా యని వారనుకొనరా?

8. “చక్రాంకనములఁగాని, యూర్ధ్వపుండ్రములఁ గాని మేము నిందింపము” అని చయనులవారు వ్రాసిరి. దీనికి వీరికి సంజీవని నమస్కరించుచున్నది. శుష్క వేదాంతులీవాక్యమునుఁ జూచియైన నిఁకమీఁద నోళ్లు మూసికొందురుగాక!

9. సంజీవని జదువని కారణమునఁ జయనులవారు సత్యజ్ఞాన శూన్యులై కొన్ని విషయములు వ్రాసిరి. అవియసత్యములని సంజీవనీ పాఠకు లెఱుఁగుదురు. కావున వానికిఁ బ్రత్యుత్తరమీయ సంజీవని ప్రయత్నింపదు. చర్విత చర్వణమేల?

10. తమ మాయావాదము మాత్రమే యద్వైతమని శ్రీచయనులవారు తలంచి కారణములు దెలిపి రేని, యనుభవాద్వైతులు, శాక్తేయులు వారి భరతము పట్టింపఁగలరు. ఆ విషయమున సంజీవని శ్రమింప వలసిన పనిలేదు. అప్పయ్య దీక్షితు లనుభవాద్వైత మతాభిమానులని శ్రీ చయనులవారెఱుంగరు కాఁబోలు. ప్రపంచమునిమిత్తము నిత్యమగు మాయ యనుదానిని బ్రహ్మము స్వీకరించుటచే శాంకరాద్వైతము శుద్ధాద్వైతము కాదని మాయా సాహాయ్యము లేకయే సర్వశక్తులుగల బ్రహ్మముప్రపంచము సృష్టింపఁ గలదనియుఁ జెప్పెడి మతమొకటి యుండుట చయనులవా రెఱుఁగరు కాఁ బోలు.

11. జగన్మిథ్య, మాయ, అనన్యము, అభేదము, అసత్యము, ఐక్యము, అను పదములకు వాస్తవాద్వైత జ్ఞానుల యభిప్రాయమునకు, శుష్క వేదాంతుల యభిప్రాయమునకు పర్వత సర్షపభేదము కలదని శ్రీ చయనులవా రెఱుంగుదురుగాక!

12. శుష్క వేదాంతి దుష్టసర్పములకు భక్తుల కేకలు కేక లేయయి, వారిని తలలువంచుకొని పుట్టలో దూఱఁజేయుట వింతగాదు. భక్తుల మెడలయందలి శ్రీ సీతా రామ లక్ష్మణ విగ్రహములుగల పతకములు శుష్కవేదాంతి రాక్షసులపాలి సుదర్శన చక్రములు. అవి కలలోవచ్చినను వా రులికిపడి చత్తురు. చయనులవారి కవి లోచన గోచరములుగాక దీర్ఘకాలము జీవింతురుగాక!

13. శ్రీరామానుజులవారి మతమునకు, శుష్క వేదాంతుల యద్వైతమునకు హస్తిమశకాంతర భేదము గలదుగాని, వాస్తవ శంకరమతమునకును దానికిని 1–2 విషయములం దప్ప విశేషభేదము లేదని సంజీవని యభిప్రాయము. ఇది శుష్క వేదాంతుల కగోచరము.

14. శంకరులు “యతిశరీరముతో స్త్రీసంసర్గము జరపినచో శాస్త్రవిరోధమువచ్చును గావున లోక

సంగ్రహార్థమునకై పరకాయ ప్రవేశ సిద్ధిని గనcబఱిచిరి. శ్రీకృష్ణుని రాసక్రీడ కేమి సమాధానము? "అని చయనులవారు ప్రశ్నించిరి. మండవ మిశ్రుcడను బ్రాహ్మణుcడుకలcడు. ఆయన కేవల కర్మవాది. ఆయనను జయింప శంకరాచార్యులాయన యింటికిcబోయి యాయనను వాదమునకుc బిలిచెను. ఓడిపోయినవాcడు గెలిచినవాని యాశ్రమము స్వీకరింప సమ్మతించి యిరువురు వాదింపc దొడcగిరి. మధ్యవర్తినిగా భారతియని శారదయని చెప్పcబడు మండన మిశ్రుని భార్యను నియమించుకొనిరి. ఈమె గొప్పయిల్లాలు, పండితురాలు. శంకర కృతజ్ఞతచే మఠములందు నేc టికిని గొల్వcబడు శారద యీమెయే యని కొంద అందురు.

ఈ వాదమునందు మండనమిశ్రుc డోడెనని యీమె చెప్పెను. ఓడిన తనభర్త సన్న్యాసియగుట కుపక్రమింపcగా భారతి శంకరులతో భర్తయందు సగము భార్యకదా! నీవు సగమే గెలిచితివి, నన్ను గెలిచి నcగదా పూర్ణజయము నీకుcగలదని యాయనతో వాదింపcగడcగి కామశాస్త్రము చొప్పున మన్మథుని కళలెన్ని? అవియెట్టివి? స్త్రీలయందు శుక్లపక్షముననవి యెందుండును? కృష్ణపక్షమున నెందుండును? పురుషులం దెందుండును? అని ప్రశ్నించెను. అప్పుడు సర్వజ్ఞుc డయిన శంకరుcడు దానికిc బ్రత్యుత్తరమి చ్చితినా యతిధర్మము చెడును? ఈయకపోయితినా సర్వజ్ఞత్వమునకు హానివచ్చునని యాలోచించి భూమి మీcద సన్న్యాసుల నియమంబుc గాపాడc దలంచి కామశాస్త్రము దెలిసియుc దెలియని వానివలె నొకనెల గడువడిగి తీసికొని యోగమార్గమునc బోయి యమరకుcడను రాజు చావcగా నాశనమును ముందువైచికొని యాతని భార్యలు మంత్రు లేడ్చుచుండుటcజూచి శిష్యులతో నేనీ దేహమునc బ్రవేశించి కళాశాస్త్రము నేర్చుకొని వచ్చెదను, అంతదాక మీరీనా దేహమును గాపాడుcడని చెప్పcగా, నది మీకుc దగిన కార్యము గాదని పద్మపాదుcడను శిష్యుc డాక్షేపించినను వినక తాను వజ్రోళి సాధించితిననియు, మునుపు శ్రీకృష్ణుcడు గోపికలతోc గ్రీడింపలేదాయని చెప్పి మృతశరీర మందుc బ్రవేశించెను. వారందఱు రాజు మరల బ్రదికెనని సంతోషించిరి. ఆవల శంకరు లాస్త్రీలతో జూదమాడుచు, పురుషాయిత క్రీడలc దేలుచు మధువుc ద్రావుచు నానా విధముల నిష్టకామోప భోగములcగిడించుచు నెలగడువు దాcటిపోవుటయుc దెలియcడయ్యెను. అప్పుడు శిష్య ప్రబోధముచేc దెలివివహించి మండనమిశ్రు నింటికివచ్చి భారతి నోడించెనcట. ఇట్లు శంకర విజయమందు చెప్పcబడెను.

ఇందు భక్తిసంజీవనికిc గొన్ని సందేహములు గలవు. వానిని శ్రీచయనులవారు పరిష్కరింతురు గాక !

శంకరులవారి సాహసకృత్యమును రచ్చకీడ్చుటయందు శ్రీచయనులవారు వివేకము కనcబఱిచిన వారు గారు. స్వమత విరుద్ధమై అశాస్త్రీయమైన పైతృక కర్మాచరణము నిష్కారణ తీవ్రక్రోధము జ్ఞాననిష్ఠయం దాయనకుc జ్యుతిగలిగించె నని మనస్సునందుంచుకొని యాయన "జ్ఞాననిష్ఠయందు నిలువc జాలcడయ్యె" నని సంజీవని వ్రాసెను. నిష్కారణముగ సంభోగ కర్మము చయనులు రచ్చకుc దెచ్చిరి.

శంకరాచార్యులవా రమరకుని స్త్రీలతో సంభోగించినది యతిధర్మవిరుద్ధమనియు నతి సాహస్యకృత్య మనియు సంజీవని యభిప్రాయము. మహాత్ము లిట్టిసాహసకార్యము చేసినను దపోబలమునc బాపముక్తులు కాcగలరు. కావున నది తక్కినవారి కనుసరణీయము గాదు.

శంకరులవారి యీ కార్యమును గుఱించి సంజీవని యిదివఱకు వ్రాసియు నది యొప్పొతప్పాయని విమర్శించినదికాదు. శంకరులవారియందు సంజీవనికిc గలగౌరవమే కారణము. ఇప్పుడును ఆకారణము చేతనే యావిషయము చర్చింపకుండినచోc జయనులవారు సంజీవని శంకర ద్వేషిణియై యాయన యందు నిష్కారణ దోషమారోపించెనందురు. ఈ విషయమై సంజీవనికిcబట్టుదల లేకున్నను బలవంత పెట్టc బడుటచేc దనకుc గల కొన్ని సందేహములను జయనువారి నడుగుచున్నది. అంతకుమించి యేమియుc జెప్పదు. వానినిబట్టి చదువరులు తీర్మానించుకొనవచ్చును.

1. భారతివాదము న్యాయ్యమగునేని జూదమున ద్రౌపదీ దమయంతు లేల యీ వాదమును బురస్కరింప రైరి? వారు భర్తృ పరాజయ మెట్లంగీకరించిరి?

2. కళాస్థానములు కామశాస్త్రము లందలి "అంగుష్ఠేచరణేచ, గుల్ఫనిలయే" ఇత్యాది శ్లోకములవలననే తెలిసికొన వచ్చునుగదా సర్వజ్ఞుcడగు శంకరుల కీవిషయము తెలియుననియుc జెప్పcబడెనుగదా. నెలగడు వేలకోరెను? స్త్రీలయందలి కళాస్థానములంటి కరcగించి చూపుమని భారతి యడుగలేదుకదా? స్త్రీసాంగత్య మేలచేయవలసి వచ్చెను? కళల నెఱుcగవలయు ననిన సంభోగమావశ్యకమని రతిశాస్త్రమందుc గలదా?

3. పురుషుల కళాస్థానముల గుఱించియు భారతి ప్రశ్నించెcగదా. ఇది యేపురుషునియొద్ద శంకరులు నేర్చుకొనెను? తన్నుcదానే తాcకి చూచుకొనెనా? స్త్రీలచేc దాcకించికొని చూచెనా? అప్పుడాయనకు రేతస్ఖలన మయ్యెను గదా. కాకుండిన నజ్ఞుcడేకదా. కళాశాస్త్రమున స్త్రీల జయింపవలెనను పట్టుదల పరమహంస ధర్మమా?

లోక సంగ్రహార్థమా?

4. రతిరహస్యములు స్త్రీలవలన నేర్చుకొనివచ్చిన పిమ్మటఁ గళాస్థానముల విషయమై శారదకు నుపన్యసించెనా? ఆమె మర్మాంగములు దాఁకి తన ప్రజ్ఞ వెల్లడించెనా? పురుషుల విషయమై యేమిచేయించి కొని చూపెను? ఉపన్యసించెనందు రేనియది ముందే చేసియుండవచ్చునుగదా?

5. శంకరులు స్త్రీలతో సంభోగించునపుడు "కెమ్మోవిఁగల యమృతమ్ముతోఁ గలియుటచేత రుచ్యంబయి చెలఁగు మధువును" ద్రావెఁగదా? స్త్రీలతో జూదమాడెఁగదా? కళాస్థాన జ్ఞానమున కివి యావశ్యకములా?

6. యతి శరీరముతో స్త్రీసంపర్కము చేయుట దోషమఁట! మనస్సుతోఁ జేయవచ్చును గాఁబోలు.

కాయిక మానసిక వ్యాపారములం దేది ముఖ్యము? జితేంద్రియు లయినవారు దేహముతో నేమిచేసిన నేమి దోషము? లంకినిఱొమ్ము దాఁకిన, నగ్న స్త్రీలఁ జూచిన, హనుమంతునకు, దుశ్శాసన- కీచక-సైంధవులు దాఁకిన ద్రౌపదికి, విరాధ-రావణులు దాఁకిన సీతాదేవికి వ్రతభంగమయ్యెనా? కాయసం పర్కము లేక మాటమాత్రముననే ఋషిపత్నులు చెడిరికదా. కావున శంకరుల జితేంద్రియుఁడైనచో నిప్పటి కొందఱు యతులవలె యతిశరీరముతోనే యేల సంభోగించి యుండ రాదు దాని కంతరార్థ మేల చెప్పియుండ రాదు? సన్న్యాసి కృత్యముల కిప్పటి ప్రమాణములు ప్రమాణములు కావనియు నంతరార్థముగల ప్రమాణములు వేఱేయున్నవనియు హ...త సన్న్యాసులవలె నేల చెప్పియుండరాదు? పరకాయ ప్రవేశమేలచేయవలసివచ్చెను? కృష్ణుఁడు పరకాయప్రవేశము చేసియా గోపికలతోఁ గ్రీడించెను.

7. తనవెనుకటి యతులకు లోక సంగ్రహార్థ మందురా? అట్లైన డంభాచారి నాటకమందు తలంటు బాలామణి వలె గుడ్డ చొక్కాలు రబ్బరుచొక్కాలు దేహమునకుఁ దొడిగికొని యిప్పుడు కొందఱు వేశ్యలు, ఱంకుటాండ్రు, విట పురుషులు సంతాన నిరోధమునకై చేయునట్లుధరించి సన్న్యాసులు మదవతులగు విధవలతో మదన సదన కదనంబులఁ గలసిమెలసి యలసి సొలసి తెలిసిన దోషములేదుగదా. ఇందు దేహము దేహమంటదుగదా? ఇదియా శంకరుల యతులకు నేర్పినది?

8. యతిశరీరముతో స్త్రీసాంగత్యము దోషమఁట. పూర్వాశ్రమందున్న దేహమే యతీశ్వరుఁడైన పిమ్మట నున్నదా. యాతనా శరీరమువలె వేఱొకశరీరము వచ్చినదా? మాఱినది దేహమా లేక మనస్సు బాహ్యచిహ్నమా? మనోజయము గలదేని శరీరమున కేల ప్రాముఖ్యమియ్య వలసివచ్చెను. యతి వేషధారితో సంభోగింపఁ గులస్త్రీలు బాహిరముగ లభింపరనియా? లోకులు నిందింతురనియా?

9. శంకరులు తాను వజ్రోళి సాధించితినని చెప్పినట్లు శంకరవిజయమందుఁ గలదుగదా "తత్రవస్తు ద్వయం వక్ష్యేదుర్లభం యస్యకస్యచిత్। క్షీరంచైవ ద్వితీయంతు నారీచ వశవర్తినీ। నారీభగే పతద్బిందు। మభ్యాసేనోర్ధ్వ మాహరేత్" అనహఠయోగ ప్రదీపిక యందుఁగలదు. దీని నెప్పుడు సాధించెను? అమరుక విధవాసాంగత్యము లేకముందేకదా? ఏపరస్త్రీయందు దీనిని సాధించెను? అభ్యాసారంభమందు రేతస్స్ఖలన మయ్యెనా లేదా? తానూర్ధ్వ రేతుఁడని చెప్పుకొనక వజ్రాళిని జెప్పనేల? వజ్రోళి రేతస్ఖ్ లనానంతర కార్యమా? పూర్వకార్యమా?

10. రతిసంభోగమందుఁ బురుషుఁడు చేయుకార్యము స్త్రీ చేసినఁగదా పురుషాయితమగును. ఇట్టి క్రీడయందు శంకరులాసక్తులైరని చెప్పఁబడెనుగదా. ఈ కార్యము జరగునపుడు శంకరులమనస్సు బ్రహ్మముపై నుండెనా? లోక సంగ్రహార్థము జరగెడి మిథునకార్యమం దుండెనా? మనస్సు బ్రహ్మముపై నుండినచో నీ కార్యము జరుగఁగలదా. చయనులవారు స్వానుభవముచే దీనికిఁ బ్రత్యుత్తర మిత్తురుగాక!

11. కృష్ణునివలెనని సమాధానము చెప్పిరిగదా?

i. గోపికలతోఁ గ్రీడించినపుడు కృష్ణునకు 8 ఏండ్ల వయస్సు. ఈవయస్సున రేతస్సే దేహమున జనింపదు. శంకరుల కిప్పటికి 25 సంవత్సరముల వయస్సునకుఁ దక్కువయుండదు. కావున రేతస్సునుద యముకలదు. అది లేకున్న వజ్రోళి సాధ్యపడదు.

ii. శంకరులవలె నాంతర సంభోగము కృష్ణుఁడు గావించినట్లు శ్రీభాగవతమునఁ బ్రమాణము గలదా?

iii. కృష్ణుఁడు నానా రూపములతో నానా గోపికలతోఁ గ్రీడించెఁగదా. అట్టులే శంకరులు నానా స్త్రీలతో సంభోగించిరికదా? నానారూపము లెత్తిరా? అమరుక దేహ మొక్కటియేకదా?

iv. సుగ్రీవునివలె, విశ్వామిత్రునివలెఁ దన్మయత్వమునఁ గామ మగ్నుఁడు కాకుండెనేని నెట్లు గడవు దాఁటునది యెఱుంగక శంకరులు తన్నుఁదాను మఱచి యుండెను? "యానిశాసర్వభూతానాం తస్మి జాగర్తిసంయమీ" యను వాక్యమేమయ్యెను. ఈ కాలమున నీయద్వైతజ్ఞాననిష్ఠ యెందుండెను?

v. లోగసంగ్రహార్థము కార్యము చేయువాఁడు వర్ణాశ్రమ ధర్మము ననుసరించి చేయవలయునా? దానికి విరుద్ధముగఁ జేయవచ్చునా? ఏధర్మమనుసరించి మగఁడు చచ్చిన స్త్రీలతో సన్న్యాసియగు తాను సంభోగించెను? లోకసంగ్రహార్థమిదియా?

vi. శంకరు లమరకమను శృంగార గ్రంథము రచించిరిగదా. వ్రాయు వ్రాఁతయందు మనస్సుంచి వ్రాసిరా. బ్రహ్మనిష్ఠయందుండి వ్రాసిరా.

vii. అమరకుని దేహమునుండి జీవుఁడు ప్రాణములు పోయెనుగదా- మగఁడు చచ్చిన భార్యలు విధవలా ముత్తైదువులా? శంకరాచార్యులకు రేతస్స్ఖలనము కాలేదనియే యంగీకరింతముగాక- ఆ స్త్రీల కయ్యెనా? లేదా? దానివలన వారి పాతివ్రత్యమునకు భంగమువచ్చెనాలేదా? దానికిఁ గర్త-కారయిత- ప్రేరకుఁడు ఆమోదకుఁడు శంకరులగు దురాకారా? ఆదోషమాయనకుఁ గలదాలేదా?

viii. జీవుఁడు ప్రాణము అమరకుని దేహమువిడిచి యంతఃకరణములతోఁ బోయెనుగదా- అమరకుని దేహమునందుండి పనిచేసినది యెవరిమనస్సు బుద్ధి?

ix. అమరుక శవమునకు దహనాదులు లేవయ్యెఁగదా? ఆ జీవమునకుఁ బ్రేతత్వము వదలలేదుకదా. ఆ ప్రేతపడు బాధలకును, తన భార్యలతోఁబరుఁడు తన వేషమున సంభోగించుటచూచు సంతాపమునకు నెవరు కారణ భూతులు.

x. జూదమాడునపుడు స్త్రీలోడిపోయిన వారి ముడ్డి తాను గిల్లునట్లు పందెము పెట్టెఁగదా తానోడిపోయినపుడు వారిచే నెచ్చట గిల్లించుకొనెను? ఇది కళాజ్ఞానమున కావశ్యకమా?

xi. మహావాక్య రత్నావళియందు "ప్రారబ్ధ ప్రతిభాస నాశపర్యంతం స్వరూపాను సంధానేనవసే త్తనియు, గౌడపాద 2-38 వ్యాఖ్యయందు శంకరులే" సదైవం బ్రహ్మాస్మీత్య ప్రచ్యుతోభవేతత్త్వా ద్ సదా౾ ప్రచ్యుతాత్మ దర్శనో భవేదిత్యభిప్రాయః ॥ యనియు దీనికిఁ దీకయందా నందగిరి అహమేవపరం బ్రహ్మనమత్తోన్య దస్తీకించిదితి స్తృతి సంతతి కరణమపిన కాల విశేష నియతం కింతు నైరంతర్యేణ కర్తవ్యమిత్యాహ-

సదైకరూపవస్తు దర్శిన ఏవపండితాః నాన్యే తథేత్యర్థః ॥ అనియు వ్రాసిరికదా. దీనివలన నిమిషమైన నిమిషార్థమైన దర్శన స్మృతి విచ్ఛితి రారాదుగదా? కాల నియమమైన నెఱుంగక స్త్రీలోలుఁడైన విస్మృతి పరుఁ డగువాని కీ స్మృతి సంతాన మెందుండెను.

xii. అమరుక దేహముతో శంకరులు చేసినది దుష్టకార్యము కాదేని యహల్యావిషయమున నింద్రుఁడు చేసిన దోషమేమి? అమరుక భార్యలకు నహల్యకుఁ దాము పరపురుషులతో సంగమించు చున్నామను జ్ఞానము కలదుగదా.

xiii. కృష్ణుఁడు లోక సంగ్రహార్థము గోపికలతోఁ గ్రీడించెని భాగవతము చెప్పుచున్నదా?

ఈ పత్రికను స్త్రీలు పఠింతురు గావున యతి సురతక్రీడ గుఱించి మఱికొన్ని ప్రశ్నలడుగ సంజీవని భయపడుచున్నది. ఈప్రశ్నలకుఁ దగిన సమాధానము లిచ్చి చయనుల వారు శంకర కీర్తికి సాంకర్యము రాకుండఁ గాపాడుదురుగాక!

పరశురామాదుల వలె మహాత్ములొక్కొక్క వేళ సాహసకార్యములు చేయుదురు? అది లోకసంగ్రహార్థ మనుట యవివేక ప్రసంగము. వారిచర్య వారితోఁబోవలయునే కాని యనుసరణీయముకాదు. దానిని వాదమునకుఁ దేరాదు?

శంకరవిజయమం దీవిషయము పచ్చిపచ్చిగా వ్రాయుట మొదట యవివేకము. సత్యము గనుక వ్రాయఁబడె నందురా తగిన సమాధానము శాస్త్రలోకసమ్మత మగాదాని వ్రాయక కుంటిసమాధానములు వ్రాయుట రెండవ యవివేకము.

నిష్కారణముగ దీని నిప్పుడు రచ్చకీడ్చుట మూఁడవ యవివేకము.

ఇంతకు శంకరాచార్యులవారు చెప్పిన వాక్యముల విన్న వారెవరు? వారెందైన వ్రాసిరా? శంకరు లాకాశమార్గమునఁ బోయిన శిష్యులేమార్గమునఁబోయి వారిని గలిసికొనిరి. ఈ విషయము విశ్వసనీయము కాదని సంజీవని యభిప్రాయము. వారు జ్ఞాననిష్ఠయం దుండలేదని సంజీవని వ్రాసినది దీని నుద్దేశించికాదు. గుమ్మడికాయలు దొంగయనిన భుజములు దడవుకొన్న సామెత చయనులు స్థిరపఱిచిరి.

15. "శ్రీశంకరులు బౌద్ధుల ప్రశిష్యులని నిష్ప్రమాణముగా వ్రాయుట యజ్ఞానమును, అద్వైత ద్వేషమును, సర్వజ్ఞత్వాభిమానమును వెల్లడించుచున్నది. మాగురు పరంపర మాపూర్వులకంటె వాసుదాసు గారికి బాగుగఁ

దెలియును గాఁబోలు” అని చయనులవారు వ్రాసిరి.

శ్రీచయనుల గురుపరంపర వారి పూర్వులకంటెఁగాని చయనులకంటెఁగాని వాసుదాసునకు బాగుగఁ దెలియదనుట యొప్పుఁదగినదే కాని వీరు శుకుని శిష్యులు గౌడపాదుఁడని వ్రాసిరికదా. శుకు లేకాలమునాఁటి వాఁడు? క్రీ. శ. 550ల ప్రాంతముననున్న గౌడపాదుఁ డేకాలమునాఁటివాఁడు? శుకుని శిష్యుఁడు గౌడపాదుఁ డెట్లయ్యెను? ఇరువురు నడుమ 3500 సంవత్సరముల యెడము గలదుగదా. 3500ల సంవత్సరములలో రమారమి 200 గురువు లుందురుగదా ఈ పరంపర వీరియొద్దఁగలదా? గౌడపాదు నాచార్య ప్రాచార్య తదాచార్య ప్రాచార్యుల పేర్లు 10 యైనఁ జయనులవారు తెలిపివారి పరంపర బుద్ధునితోఁ బర్యవసింప లేదనియు వ్యాసులతోఁ బర్యవసించెననియు సిద్ధాంతము చేయుదురుగాక. లేక తమ పరమగురువు బుద్ధుఁడని యంగీకరింతురుగాక. శుకుఁడు బౌద్ధమతాచార్యుఁడై శూన్యవాదము గావించినట్లు ప్రమాణముగలదా? తెలుపఁగోరెదను. గౌడపాదుఁడు సర్వవైనాశికుఁడగు మాధ్యమికుఁడు. శూన్యమతవాది. ఇట్లని యాయన కారికలే చెప్పుచున్నవి.

గౌడపాదుఁడు బౌద్ధుఁడా? యనువిషయమై సంజీవని దామస్వతంత్రించి యేయభిప్రాయము దెలుపదు. చయనులవలె శాంకరాద్వైతులయి శంకరాచార్యులయం దభిమానము గల వారు వ్రాసినవారి వ్రాఁతలను తెలుపుచున్నది.

బౌద్ధులు వేదమును బ్రమాణముగా నంగీకరింపరు. కావున వారు వేదబాహ్యులనఁబడిరి. ఇది యెఱిఁగి బౌద్ధుల శూన్యవాదము వేదసమ్మతమని సాధించినచో బ్రాహ్మణులుదాని నంగీకరింతురని తలంచి గౌడపాదుఁడు తర్కయుక్తులచే వేదవాక్యులను శూన్యవాదసమముగ నన్వయించెను. బౌద్ధులకు నావాక్యులకు వేదము ప్రమాణము గాదని చెప్పెను బ్రాహ్మణులకో నాదిబౌద్ధమతము గాదు. ఈ శ్రుతి వాక్యములకిదియే యర్థమని బోధించెను.

శూన్యవాదులు సర్వము శూన్యమందురు. బౌద్ధకల్పులైన శుష్క వేదాంతులో గౌడపాదమార్గ మనుసరించి బ్రహ్మము కలఁడనియు లేనివానితో సమునిఁజేసిరి.

"Sankara's followers out do the master and bring his doctine perilously near nitilistic mentality." Indian Philosophy Prof. S. Radha Krishnan, Vol. II, page 720.

శంకరాచార్యునకు నెనుక వచ్చినవారు (అద్వైతమందు) గురువునుమించి వారి సిద్ధాంతమును నాస్తికమతమని తలంచునంతటి యపాయస్థితికిఁ దెచ్చిరి. ఎట్లందురా?

“సత్యం జ్ఞాన మానందం బ్రహ్మ” మను వేదవాక్యమునకు సత్యము, జ్ఞానము, ఆనందము బ్రహ్మగుణములని బ్రాహ్మణులు చెప్పుదురు. ఈ యర్థ మంగీకిరించినఁ దమనిర్గుణ బ్రహ్మము నిర్మూలమగును కావున నద్వైతులు బ్రహ్మమున్నది. (సత్యము) యనికూడఁ జెప్పరు. ఏల? బ్రహ్మము సత్యము (ఉన్నది) అని చెప్పిన నది సత్యత్వము (ఉండుట) యను గుణముగలదిగా నంగీకరించినట్టు లగును. కావున సత్యమనఁగా Negation అసత్యమనునది లేనిది (లేనిది యనునదిలేనిది) యని యర్థమేకాని సత్యమనునది యొకటి యున్నదని Positive assertion యర్థము కాదందురు.

అట్టులే జ్ఞానమనుదానికి నజ్ఞానములేదని జడముకాదని యర్థమేకాని జ్ఞానమనునదియొకటి కలదని యర్థముగాదందురు.

అట్టులే యానందమునకు దుఃఖములేదని యర్థమేకాని యానంద మనునది యొకటి కలదని యర్థముకాదందురు.

దీనివలన నద్వైతబ్రహ్మము జడముగాదు ఆనందము లేదు. కావున దానిని బొందినవారి కానంద సుఖము లేదని యేర్పడెనుగదా.

బ్రహ్మమనునది కలదా లేదా యని యడిగిన నోరు మూసికొందురు. కలదని చెప్పినఁ గలుగుట యను గుణమున్నట్టు లంగీకరించినట్టు లగును. లేదనిన నాస్తిక వాదమగును. అంతకుమీఁద నొత్తియడిగితి మేని యదియేమో! యనిర్వాచ్యమందురు. అనిర్వాచ్యమనఁగాఁ జెప్పసాధ్యముగానిదని యర్థము. ఇది రెండు విధములు. మనస్సునకు వాక్కునకు నందని దనిర్వాచ్యమే?

సముద్రమున నెన్నిజలబిందువు లున్నవనిన నేమి చెప్పవలయును? ప్రపంచమునఁ బరమాణువు లెన్ని యున్నవనిన నేమిచెప్పవలయును. కావున నివి యనిర్వాచ్యములే. అట్టులే భగవంతుఁడు మనస్సునకు వాక్కున కందని మహిమయుననంత గుణములు కలవాఁడు కావున ననిర్వాచ్యుడని బ్రాహ్మణులు చెప్పుదురు. ఆప్రాకృతమును బ్రాకృత సాధనములచే నెట్లు తెలియనగు. ఏదియు లేక సర్వగుణ శూన్యమైన దానిని గుఱించి యేమి చెప్పుటకు సాధ్యపడదు గావున నది యనిర్వాచ్యమే. ఇది యద్వైతులు చెప్పెడునది. బ్రహ్మము ‘అ’ యనినను అకారమునకు

రక్షించువాఁడని యర్థము కావున రక్షించుట యను గుణము నంగీకరించినట్టు లగును. గుణమంగీకరించిన రూపము నంగీకరింపవలసి వచ్చును. పేరొకటి యున్నట్టు లంగీకరింపవలసి వచ్చును. అంతతో నద్వైతము హతమగును.

కావున వారు "బ్రహ్మమొకటి యున్నది" అని చెప్పరు. బ్రహ్మమనఁగానే గొప్పది గొప్పయగునదని యర్థము నొప్పినట్లగును. అది సగుణమును దెలుపును. గొప్పతనము లేని గొప్పదియుండునా?

ఏకము ఒకటి యనఁగానే ఏకత్వము అను గుణము కలదిగా నంగీకరించినట్టు లగును. కావున నద్వైతము = రెండవది లేనిదని యందు రేకాని యద్వైతులొకటి కలదని (ఏకము) యనరు. ఉన్నది అనిన నుండుట యనుగుణము కలదని యంగీకరించినట్టులగును. కావున "బ్రహ్మమొకటి యున్నది" యని యద్వైతులనరు. అనిరేని యది వ్యావహారికమే కాని పారమార్థికము గాదు. మనమేది యడిగినను "నేతినేతి" అదికాదు అదికాదు. లేదులేదు. అందురేకాని దేనినినవుననరు. కలదనరు నేతియనుటకు బ్రాహ్మణులు "అంతేకాదు" అందురు. అదికాదనుటకునం తేకా దనుటకు నెంతభేదము కలదో యాలోచింపుఁడు. కావున నీ యద్వైతమునకు శూన్యవాదమునకుఁ దారతమ్యమేమాత్రమో చూడుఁడు. శూన్యవాదులు శూన్య మనుదాని నద్వైతులు నిర్గుణబ్రహ్మమందురు. శూన్య వాదులు బుజుపద్ధతి నేదియు లేదనిరి. అత్తాకోడలిన్యాయ మనుసరించి బిచ్చములేదని చెప్పుటకుఁ గోడలి కధికారమెక్కడిదని యత్తగారు చేతితో లేదు పొమ్మన్నట్లు బ్రహ్మము శూన్యమనుటకు బాహ్యులగు బౌద్ధుల కధికారమెక్కడిది. వేదాంతులమైన మేమాట చెప్పవలయునని మాయావాదు లామాటనే త్రిప్పిచెప్పిరి. ఇట్టివి మతికొన్నిగలవు. కావుననే వీరిని ప్రచ్ఛన్న బౌద్ధులని పూర్వులనిరి. అదియేమో యనునదే సోహంతత్త్వ మసి-అహం బ్రహ్మాస్మి యనువారి పరతత్త్వము. దాని వలన వారదియేమో యనుదురు.

### ఇది యద్వైత వేదాంత సిద్ధాంత సారము.

"శాంకరాద్వైతు లెట్లు గౌడపాదకారికలఁ దమమతమునకుఁ బ్రమాణగ్రంథముగ నాదరించి యున్నారో యట్టులే బౌద్ధులు దానిని దమమత గ్రంథములలోఁ జేర్చియున్నారు"

"9వ క్రీస్తుశకమునందలి జైనులవలె బాదరాయణ వేదాంత సూత్రములను బౌద్ధులు నుపేక్షింపఁ గలిగిరి కాని తమమతముతో ననేక విషయములఁ బోలియున్న గౌడపాద కారికల నుపేక్షింపఁజాల రైరి". (మాడు I. A O. S.) ఏప్రిల్, 1913. "హిందువు లనేకు లిట్లే తలఁచుచున్నారు".

"నిజముగ భాషయందును, భావమందును గౌడపాద కారికలకు, మాధ్యమికుల వ్రాఁతలతో స్పష్టముగఁ బోలికయున్నది. అందు వారుపయోగించు ననేకములగు నుపమానములు గలవు"

**" నవిరోధో నచోత్పత్తి ర్నబద్ధో నచసాధకః**
**నముముక్షు ర్నవైముక్త, ఇత్యేషా పరమార్థతా"** **2-32.**

వినాశములేదు. ఉత్పత్తిలేదు. బద్ధుఁడులేఁడు. సాధకుఁడులేఁడు. మోక్షము గోరువాఁడులేఁడు. ముక్తుఁడులేఁడు. ఇది పరమార్థతత్త్వము.

**యథామాయా మయాద్బీజాత్, జాయ తేతన్మయోంకురః ।**
**నాసౌ నిత్యో నచోచ్ఛేదీ, తద్వద్ధర్మేషు యోజనా ॥** **iv. 59**

మాయామయమైన బీజమునుండి యట్టిదే యంకురము (ప్రపంచము) జనించెను. ఇది నిత్యముకాదు ఛేదింపఁబడునది కాదు. జన్మనాశాది ధర్మవిచారమట్టిదే. బాహ్యపదార్థములన్నియు నసత్యములని గౌడపాదు నభిప్రాయము. ii 29-31. iv ; 61-66 ; 72-73 ; వాదవిధ మెట్టిదనిన :- జాగ్రద్దశలో మనము చూచునవి సత్యములు గావు. ఇది ప్రతిజ్ఞ.

ఏలన :- అవి కానవచ్చుచున్నవి కావున : ఇది హేతువు.

ఇవి స్వప్నమందుఁగానవచ్చునట్టివే. ఇది దృష్టాంతము. స్వప్నములోఁ గానవచ్చునవి సత్యములుగా నట్టు జాగ్రద్దశలోఁ గానవచ్చునవి కానవచ్చుట యనునది యట్టిదే. ఇది హేతూపనయము. కావున జాగ్రద్దశ లోఁ గానవచ్చు పదార్థములు నసత్యములే. ఇది నిగమము.

ఇది గౌడపాద తర్కన్యాయక్రమము.

దీని ననుసరించియే ii 15-17; iv 47; iv 45-48-72, iv, 77; iv, 27; iv, 26; iv, 21-25-27. కారికలు వ్రాసెను.

iv, 25-26-27 లందుఁ జెప్పఁబడినది విజ్ఞానవాదులగు బౌద్ధుల వచనములనియు, యథార్థ వాదులగు బాహ్యార్థవాదుల (సర్వము సత్యమనువారు) పక్షము ప్రతిషేధింప గౌడపాదుఁ డనుమోదించె ననియు తమకు సమ్మతమే యని శంకరాచార్యులు iv-28వ్యాఖ్యయందు వ్రాసిరి.

గౌడపాదుల 'జగన్మిథ్య' కు శంకరుల జగన్మిథ్యకు భేదముగలదు. ప్రపంచము కేవల మిథ్యయని శంకరాభిప్రాయము గాదు.

విజ్ఞానవాదులగు బౌద్ధులు చిత్తమొక్కటి కలదనియైన నంగీకరించిరి. శూన్యవాదియగు గౌడపాదుఁడు దానిని నంగీకరించినవాఁడు కాక "తస్మాన్నజాయతే చిత్తం, చితదృశ్యం నజాయతే, తస్యపశ్యంతి యే జాతిం, ఖేవైపశ్యంతి తేపదమ్" అనఁగాఁ జిత్తమనునదిలేదు. చిత్తదృశ్యములేదు. చిత్తదృశ్యములఁ జూచెద మనువారు ఆకాశమున (పక్షుల) మార్గముఁ జూచువారే.

"ఇంతయేల గౌడపాదకారికలు శూన్యవాదుల వాదోక్తులతోను, వారి ఆలాతచక్రము (కొఱవి ద్రిప్పినఁ గానవచ్చునిప్పుచక్రము) వంధ్యాపుత్రుఁడు (గొడ్డురాలి కొడుకు) గంధర్వనగరము లోనగు నుపమానములతో ను నిండియున్నవి."

**క్లేశః కర్మాణి దేహాశ్చ ఫలానిద**
**గంధర్వ నగరాకారా మరీచిస్వప్న సన్ని భాః ॥**

**నాగార్జున మాధ్యమిక కారిక** xviii

" we need not say that Advaita Vedanta philosophy has been very much influenced by the Madhyamika doctrine. The Alata santi of Gaudapada Kakrikas is full of Madhyamika tenets The Advaitic distinction of Vyavahara, or experience and paramartha or reality correspond to the samvriti and paramartha of Madhyamikas. The Nirguna brahmam of Sankara and Nagarjuna's Sunya have much in common. The force of avidya introducing the phenomenal universe is admitted by both. The keen logic which breaks up the world into a play of abstractions, categories and relations appears in both........ According to Khandana of Sri Harsha things are anirvachaniya or indescribable ; according to Madhyamika Vritee they are Nishvabhava or devoid of essence. To be indefinable and to be characterless are, after all, the same. To the Buddhist's attitude to the unseen, Nagarjuna does not dwell much on the positive absolute, though he admits its reality. By his negative logic, which reduces experience to a phenomenon he prepares the ground for the Advaite philosophy. It is a strange irony that the great exponents of the two doctrines look upon themselves as supporting anatagonistic views." (Indian Philosophy. rdo. S. R. Krishna, Vol. 1, pages 668-669.)

"Through the influence of Buddhism and its schools the non-dual nature of reality and the phenomenal nature of the world came to be emphasised in the systems of Gaudapada and Sankara. As a matter of fact such an advaitic philosophy seems to be only a revised version of the Madhyamika Meta rhysics in Vedic Termilology. In Philosophy Vol. I, page 259.

గౌడపాదుఁడు బుద్ధుఁడని యింతకంటె స్పష్టముగఁ జెప్పుటెట్లు?

దీని వలన నద్వైతవాదము బిడ్డయనియు శూన్యవాదము తల్లియనియు నద్వైతుల లేఖనముల వలననే యేర్పడెను గదా. శంకరుల యభిప్రాయమందు నాధారమైన త్రాడు సత్యము దానియందుఁ దోఁ చు సర్పము భ్రాంతి. గౌడపాదునకు రెండును భ్రాంతులే. త్రాడును ద్రాడనుకొనుటకూడ మిథ్యయే.

" గౌడపాదుని కృతియందు సామాన్యముగ వ్యాపించియుండు బంధము-మోక్షము-జీవాత్మ-ప్రపంచము-సర్వమసత్యమను నభిప్రాయమును బట్టి విమర్శకులు అసత్యప్రపంచములోని యసత్యబంధము నుండి యసత్యమైన పరమశ్రేయస్సు ఘటించుటకై యసత్యమైన యాత్మ యత్నించుచున్న దనువాదము కంటె మేలగునది చెప్పలేనిమతము అసత్యమే యని యభిప్రాయపడిరి." ఇట్టి వాదముచేయు గౌడపాదుఁడు ప్రచ్ఛన్నబౌద్ధుఁడు గాక మఱియెవఁడు?

గౌడపాదుఁడు తనకారికల కంతమున (iv,99) "నైతద్బుద్ధేన భాషితమ్" ఇది బుద్ధుఁడు చెప్పినది కాదని వ్రాసెను. బౌద్ధవాదమునకుఁ దన వాదమునకుఁ బోలిక లేదని తనకు దోఁచెనేని యిట్లు వ్రాయునా? ఒకఁ

డొకపక్షిని గోడమీఁద వ్రాసి దానిక్రింద నిది చిలుక యని వ్రాసెనఁట- చూచినవాఁడొకఁ డిదియేల యిట్లు వ్రాసితివనినఁ జూచినవారు కాకి యని తలంతురని వ్రాసితిననెనఁట- తాను వ్రాసినదానిని జూచిన వారు కాకి యని తలంతురని చిత్రకారునకుఁ దోఁపక యుండిన నతఁడేల యట్లు వ్రాయును? అట్టులే గౌడపాదుఁ డును దాను వ్రాసిననదానికి బౌద్ధమతమునకుఁ బోలిక యుండు చేతనే యట్లు వ్రాసెను. గౌడపాదుని యద్వైతము బౌద్ధమును సమీపించు చున్నదని శంకరులును వ్రాసిరి.

"గౌడపాదుఁడు స్వయముగ బుద్ధుఁడనియు నుపనిషత్సిద్ధాంతమునకు బౌద్ధమునకు సామ్య ముండుటచే మధ్యమ కారికలకు వ్యాఖ్యానము వ్రాసెననియుఁ జెప్పెడివారు గలరు"

(see Dasa Gupta, History of Indian Philosophy pages 423-428)

అద్వైత వేదాంతులు విజ్ఞాన భిక్షువుపే రెఱుఁగక యుండరుగదా. ఆయన సాంఖ్యకారికలందు నేమి వ్రాసెనో చూడుఁడు.

"మన బంధమునకుఁ గేవల మజ్ఞానము కారణమని తెలుపు బ్రహ్మసూత్ర మొక్కటియైన లేదు. వేదాంతులమని పేరుపెట్టుకొన్న కొంఱ నూతన మాయా వాదము బౌద్ధ విజ్ఞాన వాదమునం దొకభేదమే."

ఇట్టి మాయావాదము చేయువారు బౌద్ధులుగాక మఱెవ్వరు? "గౌడపాదుని కృతియందు బౌద్ధ మతముయొక్క ముఖ్యముగ విజ్ఞానవాద మాధ్యమిక వాదములయొక్క పోకలు గానవచ్చుచున్నవి గౌడపాదుఁడు బాహ్యపదార్థ నిరాకరణ మందు విజ్ఞానవాదులు చెప్పుకారణములనే చెప్పుచున్నాఁడు. శంకరాచార్యులు తనసిద్ధాంతమును విజ్ఞాన వాదము నుండి వేఱుపఱుప యత్నించుచున్నాఁడు గాని గౌడపాదుఁడు దానిని స్వీకరించుచున్నాఁడు. విజ్ఞాన వాదమునుగూడఁ బూర్ణముగ నంగీకరింప నిష్టములేక విషయమెంత యసత్యమో దానికిఁ గారణమైనది విషయి యంత యసత్యమే యనుచున్నాఁడు. (కారణ కార్యములు రెండు నసత్యములే.) ఈ కారణముచే నాయన చేయునది నాస్తికవాదమా యను సందేహస్థితికిఁ దెచ్చెను. శూన్య వాదియగు నాగార్జునువలె గౌడపాదుఁడును గారణమును వికారమును నిరాకరించు చున్నాఁడు నాగార్జునుఁడు సంవిత్తనుదానినే గౌడపాదుఁ డవిద్య యనుచున్నాఁడు."

ఈ సిద్ధాంత విషయములందేకాక కారికలందు శబ్ద ప్రయోగమందును బౌద్ధమతముయొక్క ప్రాబల్యము నిస్సందేహముగఁ గానవచ్చుచున్నది. ధర్మ, సంవృత్తి, సంఘాత శబ్దములను బౌద్ధు లుపయోగించు నర్థమునందే గౌడపాదుఁడు నుపయోగించెను."

"గౌడపాదునియందుఁ(అస్తి) గలదనుదానికంటె మాధ్యమికులలేదు (నాస్తి) కాదను వ్యతిరేక వాదము మిగుల విస్తరించియున్నది. శంకరునందు రెండు సమముగనున్నవి."

బౌద్ధుల శూన్యవాదమును గౌడపాదుఁడు వేదాంతమునకు సరిపెట్టెనని విధుశేఖర భట్టాచార్యులు సుఖటంకరులు లోనగువారు తలంచుచున్నారు బౌద్ధ మతవిషయము వచ్చినపుడు శంకరులేదో సమాధానము చేఁ గప్పిపెట్టుట శోచనీయము (సూ. భా. iv. 1,2 19-42-90.)"

తన ప్రాచార్యుఁడు బౌద్ధుఁడని స్పష్టముగఁ జెప్పనిష్టములేక శంకరాచార్యులు చేసిన చమత్కారమున కొక దృష్టాంత మిచ్చెదను. గౌడపాద కారికలందు నాలవది యగు కొఱివిని చల్లార్చుటయను నలాతశాంతి ప్రకరణ మందు మొదటి శ్లోకమున నాచార్యపూజ యెట్లు గావింపఁబడెనో చూడుఁడు.

**జ్ఞానే నాకాశకల్పేన, ధర్మో యో గగనోపమా**
**జ్ఞేయా- భిన్నేన సంబుద్ధ' స్తం వందేద్విపదాంవరమ్ ॥**

ఆకాశమువంటి జ్ఞానముచే నాకాశమువంటి ధర్మములను దనకంటె నభిన్నములుగా నెవఁడు దెలిసికొనెనో యట్టి వారి బుద్ధుని రెండుకాళ్లుగలవారిలో (మనుష్యులలో) శ్రేష్ఠుని నమస్కరించెదను. ఆకాశమనఁగా శూన్యమని మహావాక్యరత్నావళియందుఁగలదు. అని ధ్యానింపఁబడఁగా శంకరాచార్యులు సంబుద్ధుఁడనుటకు "అయమేవేశ్వరో నారాయణాఖ్యఃతం వందే అభివాదయే; ద్విపదాంవరం = ద్విపదోపలక్షి తానాం పురుషాణాం, వరం = ప్రధానం పురుషోత్తమ మిత్యభిప్రాయ" యని వ్రాసిరి. అనఁగా నారాయణుఁ డను పేరుగల యీశ్వరుఁ బురుషోత్తము నమస్కరించెద నని యభిప్రాయము మని వ్రాసిరి. గురువుల నడవడి రచ్చకీడ్చు చయనులవలెఁ గాక గురుదోషముల దాఁచువాఁడు ఛాత్రుఁడు గావున శంకరాచార్యులు తన సత్య శిష్యత్వమును బ్రకటించుటేకాక తన నారాయణ భక్తియుఁ బ్రకటించెను. కాని నారాయణుఁ డేయూరు? గౌడ పాదుండేయూరు? నైతద్బుద్ధేన భాషితమ్మనుచో (ఇది బుద్ధుఁడు చెప్పినదికాదు.) అను నీయర్థమే గ్రహింపవలయునా?

మీఁద ననువదించిన నని రోధో నచోత్పత్తి యను శ్లోకము (ii 32).

**స్వతోవా పరతోవాపి, నకించిద్వస్తుజాయతే**
**సదసత్సద సద్వాపి నకించి ద్వస్తు జాయతే.** **iv, 22.**

ఏవస్తువైనను దనంతటఁ గలుగదు ఇతరమువలనఁ గలుగదు. సత్తుగాని యసత్తుగాని సదసత్తుగాని పుట్టున దొకటి యునులేదు.

**అవస్త్వనుపలంభంచ, లోకోత్తర మితి స్మృతమ్**
**జ్ఞానం జ్ఞేయంచ విజ్ఞేయం సదాబుద్ధైః ప్రకీర్తితమ్** **iv, 88.**

ఇట్టివి చదివిన యెవనికి (శూన్యవాదియగునాగార్జును) మాధ్యమిక కారికలు స్మరణమునకు రావో.

మీఁదవ్రాసిన విషయములు సంజీవని విషయమై చయనులవా రూహించి వ్రాసిన దబ్బఱలవంటివి కావు. సంజీవని కల్పితములు గావు. గ్రంథస్థములు. చయనులెట్టి యద్వైతులో యట్టి యద్వైతులే యగు ప్రొఫెసర్, యస్. రాధాకృష్ణయ్యగారు (ఆంధ్రులు) లోనగువారు వ్రాసినవే. కావున శంకరద్వేషము అద్వైత ద్వేష మున్నదని చయనులవారు వారిని దూషింప వలయునుగాని సంజీవనిని దూషించి ప్రయోజనములేదు. అది కల్పించిన దేదియులేదు. గ్రంథస్థ ప్రమాణములఁ జయను లెట్లు నిరాకరింపఁగలరు? వారింగ్లీషు చదివినవారగుటచే వారి వాక్యములు ప్రమాణములుగానందు రేమో? అది బుద్ధిగలవారు చెప్పెడి మాటకాదు.

శంకరాచార్యులు బౌద్ధప్రశిష్యుఁడని సంజీవని వ్రాసెనేకాని యాయన బౌద్ధుఁడనియుముందు వ్రాయ లేదు. ఆమాత్రమునకే చయనులవా రాగ్రహోదగ్రులైరి. శ్రీరామానుజ రామకృష్ణ పరమహంస లద్వైతి శిష్యులుగారా? ఆ మాత్రమున వారికొక లోటువచ్చెనా?

గౌడపాద ప్రశిష్యులైన యీ శుష్క వేదాంతులు జగత్తు మిథ్య, మోక్షము, జీవతత్త్వము, సగుణ నిర్గుణ బ్రహ్మము, లోనగువానికిఁ జెప్పెడు నర్థమునకు, శంకరాభిప్రాయమునకు భేదము గలదు. శంకరాభిప్రా యము గర్హ్యముకాదు. కావునను, వారు విష్ణుభక్తులై యన్యదేవతా ద్వేషములేక భక్తిమార్గమున వర్తించి బదరీనారాయణ మందుఁ గోవెలఁ గట్టించి తమ మతములందును విగ్రహారాధనమున కేర్పాటులుచేసి సంసారులకు భక్తి ప్రపత్తు లవశ్య గ్రాహ్యములనియు నద్వైత భావము నిషిద్ధమనియుఁ జెప్పినవారగుట చేతను, సంజీవనికి శంకరులు వంద్యులే యగుదురు. శూన్యవాదిసములు శుష్క వేదాంతులు లోకనింద్యులే యగుదురు. కావున వీరి మాటలువిని లోకులు చెడకుందురుగాక! తమ మాటలు తమకు నర్థముగాక యెదుటివారికి నర్థముగాకుండునట్లెంత వెఱ్ఱిగ మాటలాడినంత యుత్తమ వేదాంతమని లోకులు దలంతురని దొంగ వేదాంతుల యభిప్రాయము.

వాసుదాసుఁడు నందూరిలో నున్నప్పుడు కొందఱు పండితులు సంభాషించుటయందుఁ దమసన్న్యాసి స్వాములవారి పాండిత్యాతిశయమును బొగడుచు నందొకఁడు భగవద్గీత యందు యుధ్యస్వ = యుద్ధము చేయుమని చెప్పినమాటకు నంతరార్థము యుద్ధము చేయవలదని తమస్వాములవారు చెప్పిరని చెప్పెను మఱియొకఁడు శంకరాచార్యులవారు కూడ యుద్ధము చేయమని చెప్పినట్లే వ్రాసిరే యనిన మన స్వాముల వారా మాటలకుఁగూడ యుద్ధము చేయవలదను నంతరార్థమే సమర్థించిరని మొదటి పండితుఁడు చెప్పెను.

సంకల్ప వికల్పములకు నడుమనుండునది పరబ్రహ్మమని స్వాములవారు చెప్పిరఁట. రెంటికి నడుమ నేమియుండుననిననది బ్రహ్మవిద్వ ద్వరిష్ఠులకుఁ దెలియు విషయమే కాని యితరులకుఁ దెలియద నిరఁట. దీనిని వ్రాఁతమూలకముగఁ జెప్పుఁ డనిసంజీవని పత్రికాధిపతి కోరెను గాని వ్రాసి యియ్యరైరి. ఈ వేదాంతమును నంతరార్థమును వినుటకు గూడ మతిమంతులు కొందఱు పోవుచుందురు.

శంకరాచార్యునం దభిమానము గలవారును, బౌద్ధులును, బుద్ధుఁడే తాను బుద్ధుఁడుగా నున్నప్పుడు చేయఁగా మిగిలిన పనిచేయ శంకరచార్యులుగా నవతరించెనని చెప్పుచున్నారు.

" The shock of death was broken, and like many other adepts He (Buddha) threw off the mortal coil and left it to be burnt, and its ashes to serve as relics, and began in the planetary life clothed in his subtle body. He was born as Shankara the greatest Vadantic teacher of India ; whose philosophy based as it is entirely on the fundamental axioms of the eternal Revelation-, the Shruti, or the Primitive Wisdom. Religion, as Buddha from a different of view had before based His - finds itself in the middle ground between the too exuberantly veiled metaphysics of the orthodox brahmins and those of Gautama, which stripped in their exortic gard of every soul - vivifying hope transcendental aspiration and symbol, appear in their cold wisdom like crystaline icicles, the skeleton of the primeval

truths of Esoteric Philosophy.

Was Sankaracharya Gautama the Buddha, then, under a new personal form? It may perhaps only puzzle the reader the more if he be told that there was the 'astral'. Gautama inside the outword Sankara.

Thus it is averred that Gautama Buddha was re-incarnated in Shankaracharya that as is said in Esoteric Buddhism "Shankaracharya, simply was Buddha in all respects in a new body. (Secret doctrine, page 175, 5th edition.)

They had therefore to struggle with a world to which they could import only what they but half-knew themselves and no more.

As tradition goes, the Barhmans has committed a heavy sin by persecuting Gautama Buddha and His teachings instead of blending and reconciling them with the tenets of pure Vedic Brahminism as was done later by Shankaracharya" (page 382).

బుద్ధుఁడే శంకరుఁడుగాఁ బుట్టెనను నీ గ్రంథకర్తపై చయనుల వారెంత పండ్లు పట పట గొఱుకుదురో.

శ్రీ చయనులవారు శివగీత తమ కాధారముగఁ జెప్పిరి గదా. ఈ శివగీత పద్మపురాణమందలిదిగదా? అట్టి పద్మపురాణము శుష్క వేదాంతుల మాయావాదము గుఱించి యేమి చెప్పుచున్నదో చూడుఁడు.

**మాయావాద మసచ్ఛాస్త్రం, ప్రచ్ఛన్నం బౌద్ధముచ్యతే**
**మయైవ కథితందేవి, కలౌబ్రాహ్మణ రూపిణా**
**అపార్థం శ్రుతి వాక్యానాం, దర్శితం లోకగర్హి తమ్**
**కర్మస్వరూప త్యాజ్యంయ, దత్రైవ ప్రతిపాద్యతే**
**బ్రహ్మణశ్చపరం రూపం, నైర్గుణ్యం వక్ష్యతేమయా**
**సర్వస్య జగతోత్యంత, మోహనార్థం కలౌయుగే**
**వేదార్థవన్మహాశాస్త్రం, మాయావాద మవైదికమ్**
**మయైవ వక్ష్యతేదేవి, జగతాం నాశకారణాత్**

**అర్థము.**

మాయావాద మసచ్ఛాస్త్రము. బ్రాహ్మణ రూపము ధరించిన నాచేఁ జెప్పఁబడెను. ఈమతమందు వేదవాక్యముల కపార్థంబును, కర్మస్వరూప త్యాగంబును, సర్వకర్మ పరిభ్రష్టత్వము జీవాత్మ పరమాత్మల కైక్యము బ్రహ్మస్వరూపము నిర్గుణమని నాచేఁ జెప్పఁబడెను. లోకులను మోహింపఁ జేయ వేదార్థమువలెఁ గానవచ్చును వేదవిరుద్ధమగు మాయావాదము లోకనాశమునకై నాచేఁ జెప్పఁబడును.

చయనులవారి ప్రశ్నములకు యథాశాస్త్రముగఁ బ్రత్యుత్తరము లీయఁబడెను. మోసగాండ్ర వలలలోఁ బడి లోకులు చెడకుండవలయునను తలంపునఁదప్ప నేవిషయమందును సంజీవనికిఁ బట్టుదల లేదు. ఈవాద ప్రతివాదమువలన వాస్తవము లోకమెఱుంగఁగలదు. కావున నీవాదము విషయమై సంజీవని యిఁక నేమియు వ్రాయదు. లోకులు తమ శ్రేయస్సు నాలోచించి వారివారి కుచితమైన మార్గమునఁ బోవ చ్చును. తెలిసి చెడువారిని జక్కదిద్దువాఁడు లేఁడు. యథార్థవాదులెవరో వంచకులెవరో లోకమెఱింగినఁ జాలును.

శ్రీచయనులవారు తాము భక్తిపరులమని వ్రాసికొనిరి గదా ఈ భక్తిలక్షణ మెట్టిది? వివేకచూడామణిలో శంకరులు చెప్పిన స్వస్వరూపానుసంధానమా? కాక ప్రేమపూర్వక సేవయా? ఈ రెంటిలో వీరు దేనిననుష్ఠించు చున్నారు? స్వస్వరూపానుసంధాన మందురా? స్వస్వరూపలక్షణ మెట్టిది? నేతి నేతి యని సర్వనిరాకరణము వలన నేర్పడి శూన్యమునకుఁ బర్యాయపదమైన నిర్గుణబ్రహ్మమా? మఱియొండా? మఱియొండగునేని వీరద్వై వ్రతులెట్లయిరి? సోహమ్మని వీరు స్వస్వరూపాను సంధానముచేయ వీరికధికారము కలదా? అటుగాక ప్రేమ పూర్వకసేవ యందురా? యద్వైత గ్రంథముల వలన బ్రహ్మ విష్ణు శివాదులు లోనగు సర్వప్రపంచము వేదాదులు మిథ్యయను జ్ఞానముగలిగిన తరువాత మిథ్యావస్తువులందుఁ బ్రేమకలుగఁగలదా? మనస్తత్వమట్టి యసాధ్యకార్యము చేయఁ గలదా? వీరు ప్రపంచము గొడ్రాలికొడుకువంటి దందురు కదా. గొడ్రాలి కొడుకుపైఁ బ్రేమ యెవరికైన నుండఁ గలదా?

ఇట్టికష్టము కలుగుననికదా సన్న్యాసు లగువఱకు నెవ్వరు బ్రహ్మజిజ్ఞాస చేయరాదని శంకరులు శాసించిరి. కానఁ దాము పూజించు దేవుఁడు మిథ్యయని లోనెఱిఁగి వెలుపల భక్తి గలిగినవానివలె నటించుట దొంగ భక్తి లక్షణమా? సత్య భక్తి లక్షణమా? ఇంతకంటె మిథ్యాచారుఁడెవఁడు?

అటుగాకున్న నద్వైత బోధయందుఁ దమకు విశ్వాసము లేదని చెప్పెదరా? అద్వైత వేదాంతగ్రంథములు చదువనివారును, చదివినను వానియందు శ్రద్ధలేనివారును, భక్తులనిన నంగీకరింపవచ్చును గాని శుష్క వేదాంతు లందు భక్తిగలదనుట కల్లమాట. అద్వైతతత్త్వ మున్నదున్నట్లు చెప్పినఁ దమ్ము నాస్తిక ప్రాయులని లోకము గర్హిం చునని యీ వేషభాషల నభినయించెదరుకాని త్రికరణశుద్ధిగఁగాదు. సోహమ్‌లోని సః తత్త్వమసిలోని 'తత్' బ్రహ్మాస్మిలోని బ్రహ్మము దేనిని బోధించునో దానిలక్షణము పూర్ణముగా వీరు వివరించి రేని యున్న రంగు బయలుపడును.

అద్వైతులు ముఖ్యప్రమాణ గ్రంథములలో నొకటిగా నెంచఁబడు మహావాక్య రత్నావళియందలి యీ వాక్యములను బఠించి యా యద్వైతము నాస్తిక వాదమో శూన్యవాదమో ఆస్తికవాదమో బుద్ధిమంతులు నిశ్చయించుకొందురుగాక !

**"ద్వితీయకారణా భావా, దనుత్పన్నమిదంజగత్**
**యథైవేదం నభశ్శూన్యం, జగచ్ఛూన్యం తథైవహి**
**ఇదంప్రపంచం యత్కించి, ద్యద్యజ్జగతి వీక్ష్యతే**
**దృశ్యరూపంచ దృగ్రూపం, సర్వం శశవిషాణవత్**
**ఇదంప్రపంచం నాస్త్యేవ, నోత్పన్నం నోస్థితంజగత్**
**చిత్తం ప్రపంచమి త్యాహుః, నాస్తి నాస్త్యేవ సర్వదా**
**మాయాకార్యా దికంనాస్తి, మాయానాస్తి భయంనహి**
**పరంబ్రహ్మాహ మస్మీతి, స్మరణస్య మనోనహి**
**నంధ్యా కుమారవచనే, భీతిశ్చే దస్తిదం జగత్**
**శశశృంగేణ నాగేంద్రో మృత శ్చే జ్జగదస్తిసత్**
**మృగతృష్ణా జలంపీత్వా, తృప్తశ్చే దస్త్వి ్వదంజగత్**
**గంధర్వనగ రేసత్యే, జగద్భవతి సర్వదా**
**గగనే నీలిమానత్యే, జగత్సత్యం భవిష్యతి**
**మాసాత్పూర్వం మృతో మర్త్యో, హ్యాగతశ్చేజ్జగద్భవేత్**
**గోప్తనా దుద్భవత్ క్షిర, పునరారోపణే జగత్**
**జ్వాలాగ్నిమండలే పద్మ వృద్ధిశ్చే దస్త్వి ్వదం జగత్**
**జ్ఞానినో హృదయం మూఢైః జ్ఞాతంచే దస్త్విదం జగత్**
**నాస్తి నాస్తి జగత్సర్వం, గురుశిష్యా దికంనహి"**
**"రక్షకో విష్ణురిత్యాది, బ్రహ్మాసృష్టేస్తు కారణమ్**
**సంహారే రుద్రఇత్యేవం, సర్వం మిథ్యేతి నిశ్చిను ॥"**

**అర్థము.**

రెండవకారణము లేకపోవుటచే నీప్రపంచ ముత్పత్తి కలదికాదు. ఈ యాకాశమెట్లు శూన్యమో యట్లే జగత్తు శూన్యము. ఈ ప్రపంచము ఇందుఁ గానఁబడునది దృశ్యరూపము దృగ్రూపము సర్వము కుందేటికొమ్మువంటిది. ఈ ప్రపంచము నాస్తియే. దీని కుత్పత్తిలేదు. స్థితియులేదు. కొందఱు చిత్తము ప్రపంచమందురు. లేదు లేదు. అట్టిది సర్వదా లేదు. మాయ చేయుకార్యము లేదు. మాయయు లేదు. భయము లేదు. నేను పరబ్రహ్మమని స్మరించుటకు మనస్సును లేదు. గొడ్రాలికొడుకు మాటలవలన భయము కలదేని ప్రపంచము కలదు. కుందేటికొమ్ముచేఁ బాము చంపఁబడునేని జగత్తుకలదు. ఎండమావుల నీరు త్రాగుటవలన దప్పియాఱునేని ప్రపంచము కలదు. గంధర్వ నగరము సత్యమయ్యెనేని సర్వదా ప్రపంచము సత్యమే. ఆకాశమునందు నీలవర్ణము సత్యమయ్యెనేని ప్రపంచము సత్యమే నెలకుఁ బూర్వము చచ్చినవాఁడు మరల వచ్చునేని జగము సత్యమే. ఆవు పొదుగులోనుండి వచ్చిన పాలను మరల దానిలోఁ బోయఁగలిగిన జగము సత్యమే. మండెడు మంటలోఁ గమలములు వృద్ధిచెందినఁ బ్రపంచము సత్యమే. జ్ఞానుల హృదయము మూఢులెఱుంగుదు రేని జగము సత్యమే ప్రపంచము లేదు లేదు. గురుఁడులేఁడు. శిష్యుఁడులేఁడు.

విష్ణువు రక్షకుఁడని, బ్రహ్మ సృష్టికర్త యని శివుఁడు సంహారకుఁడని చెప్పుదురు. ఇదంతయు మిథ్యయని నిశ్చయించుకొనుము".

× × ×

## ఇది యద్వైత వేదాంత సిద్ధాంత తత్త్వరహస్యము.

ఇది శుష్క వేదాంతులు చేయు నుపదేశము.

ఇందలి యుపమానములు వాదములు శూన్యవాదులగు బౌద్ధుల యుచ్ఛిష్టము కావేమో శుష్క వేదాంతి చక్రవర్తులు సెలవిత్తురుగాక! ఈ యుపదేశమువిని గొడ్రాలియందు నపుంసకునకు జనించి, యెండమావుల నీటియందు స్నానముచేసి, యాకాశ పుష్పములను బట్టతలయందు ధరించి, ముత్తెపుఁ చిప్పలోని వెండిచే నాభరణములు చేయించి, యలంకరించుకొని, త్రాటియందుఁ గానవచ్చు సర్పమును కుందేటి కొమ్ముచే రాతిస్తంభమునందుఁ గాన్పించు పురుషునిచేఁజంపించి, గంధర్వ నగరమందు మాచకమ్మ తో సంభోగించి, సంతానము గాంచువాఁడు ముక్తుఁడగును.

మీఁదఁ జెప్పఁబడిన వాదముచేయు శుష్క వేదాంతులే యసురులని భ. గీత. 16వ యధ్యాయ మందుఁ జెప్పఁబడిరి. వీరికి జన్మజన్మమున నధోలోకములే గతియని శ్రీకృష్ణ భగవానుఁడు 19-20 శ్లోకములందు ననుగ్రహించెను.

వేదాంతసార పీఠిక కాంధ్రానువాదము.

"ఈ కారణములచే శంకరుల స్వవాక్యముల వలననే పరంబ్రహ్మ, అపరంబ్రహ్మ, పర ఈశ్వర, ఈశ్వరశబ్దములు కేవల సమానార్థకములు. పర్యవసానమున శంకరాభిప్రాయమునకు రామానుజాభి ప్రాయమునకు భేదములేదు"

"ఈ సిద్ధాంతమునకు స్తంభములవంటి వానిలో నొకటైన ముఖ్యపరస్పర భేదములుగల మఱికొన్ని పదములందు మరల మరల నొకదానికి బదులు మఱియొకటి కానవచ్చుచున్నది.

ఈ కారణముచే విశిష్టాద్వైతులో లేక యటువంటి యభిప్రాయముగల మఱియొక సిద్ధాంతమువారో శంకరాచార్యుల కాలమున దేశము నావరించి ప్రాముఖ్యము వహించి యుండిరనియు నాయన మనస్సు వారి సిద్ధాంతములతో నూరిపోయి విరుద్ధమతమును స్థాపింప యత్నించినను వానినుండి విడివడఁజాల కుండెనను తీర్మానమునకుఁ దప్ప వేఱొక తీర్మానమునకు వచ్చుట నాకసాధ్యమని తోఁచుచున్నది".

ఈ విషయమున సంజీవని యభిప్రాయమేమన :- శంకరాచార్యులవారి కాలమున నుత్తరమున బౌద్ధమతము భాట్టమతము ప్రబలి యుండెను. దక్షిణమున శైవవైష్ణవ విశిష్టాద్వైతములు ప్రబలియుండెను గౌడపాదుఁడు మసిపూసి మారేడు నేరేడు చేయునట్లు బౌద్ధమును వైదికమత మనిపించ యత్నించెను. శంకరాచార్యులు వేఁడినీళ్లకుఁ జన్నీళ్లుచేర్చినట్లు గౌడపాదాచార్య శూన్యవాదమును ఆ స్తికవాదముగాఁ గానవచ్చునట్లు మిథ్యాది పదములకు నర్థము మార్చిచెప్పి వైష్ణవ మతముతో సామరస్యము గల్పింపనెంచి విష్ణుపరత్వమును, విశేషించి యట్టి యనుష్ఠానము, గలవాఁడయ్యెను గాని బౌద్ధులాయన మతము నెక్కువగ నాచరించుటచేత విశిష్టాద్వైతులు, శైవులు వైష్ణవులు మొదలగువారు సందిగ్ధచిత్తులై దానిని సమూలముగ నిరాకరించిరి. శుష్క వాదాంతులు గౌడపాదాభిప్రాయమునకుఁ బ్రాముఖ్యమిచ్చుచు శంకరులనుగూడ శూన్య వాదిగానే కనఁబడఁ జేయుచున్నారు. ఇది శోచనీయము. శంకరాచార్యులు శూన్యవాదమును బరమహంస పరివ్రాజకులకు మాత్రమే చెప్పిరి. నూర్గురు సన్న్యాసులలో నిజమైన సన్న్యాసియొకఁ డుండినచో దేశమునకు హానిలేదు. వాఁడు శవమువంటివాఁడే. అట్టివారు నూర్గురికి నూర్గురుండినను దోషములేదు. శూన్యవాదము వారియందు మాత్రమే శంకర మత ప్రకార ముండును. ఇప్పుడో సంసారులు శుష్క వేదాంతులయి గురుద్రోహు లై వారి శాసనము నుల్లంఘించి తమకధికారము లేకున్నను నధికారము లేనివారికి శూన్యవాదమును బోధించితాఁజెడ్డక్రోఁతి లెఱుఁగనివారిని భ్రష్టులఁ జేయుచున్నారు. ఈ దౌష్ట్యము సహ్యముగాదు. శంకరాచార్య లవారి సిద్ధాంతమున భక్తిపరముగ నుండువానిని గ్రహించి సామరస్యమును లోకమునకుఁ దెలుపవలయునని సంజీవని సంకల్పము. ఇది యసాధ్యవిషయముగాదు. శుష్క వేదాంతులు గుట్టురట్టయి వారి నిజమైనవన్నె బయలు పడినగాని సంజీవని వాక్యములు సందిగ్ధచిత్తుల తలల కెక్కవు.

యోగవాసిష్ఠ మీ సంధికాలమున జనించినదే. ఇది యాధునిక గ్రంథమని యద్వైతి శిఖామణి బాలగంగాధర తిలక్కుగారు గీతారహస్యమున వ్రాసిరి. శంకరాద్వైత వేదాంతమను గ్రంథమందు, ప్రొఫెసరు ఎస్. రాధాకృష్ణయ్యగారు

Yoga Vasishta is coloured by the Buddhistic views.

యదిదం దృశ్యతే కించిత్తన్నాస్తి కిమపి ధ్రువమ్
యథా గంధర్వనగరం, యథావారి మరుస్థలే (ii) "

అని వ్రాసిరి. అనఁగా యోగవాసిష్ఠము బౌద్ధుల యభిప్రాయములతో రంగువేయఁబడినదని యర్థము. దృష్టాంతము శ్లోకము. ఈ విధముగ నాయాకాలముల నాయామతముల నుద్ధరించు గ్రంథములు పుట్టుట వింతగాదు. కాని గ్రంథప్రతిష్ఠకై యుంచఁబడిన పేర్లుగలదానిని సత్యమని యెంచుట మూఢత్వలక్షణము. జాబాలికి శ్రీరామచంద్రమూర్తి పెట్టిన చీవాట్లు చదివిన వాఁడు శూన్యవాదమును వసిష్ఠుఁడు శ్రీరామునకు బోధించెననిన వివేకముగలవాఁ డెవ్వఁడునమ్మును.

వేదాంతసారపీఠిక కాంధ్రాను వాదములు.

"ఇది వేదాంత తత్త్వమును సంగ్రహముగ బోధించుచున్నది. ఇది హిందువుల భావమును జిక్కఁగా బోధించుచున్నదని యెంచఁబడినది. అయినను దేవుఁ డసత్యమని యిది పరిహరించుచున్నది. ఆయన స్థానమున జ్ఞానములేని నిరాకార తత్తును స్థాపించుచున్నది. మోక్షవిషయమున దాని యుత్కృష్టాభిప్రాయ మేమన :- జీవనాశమే. అయినను నెవరైన శోధించి యుపనిషత్తులఁ జూడఁ గలుగుదు రేని వారు చేతనుఁడై సత్యమైన దేవుని నిజముగకనుఁ గొనియే యుందురు. కావున దేవుఁడు తన్నుఁదాను మనకు గోచరింపఁ జేయవలసినవాఁడై యుండవలెను. లేదా యాయనగుఱించి మనకెన్నఁటికిఁ దెలియకయే యుండవలెను."

పురాతనోపనిషత్తులు వేదాంత సూత్రములు దానిని (మాయావాదమును) బోధింపఁజాలవను నాయన పర్యవసానాభిప్రాయము నిరాకరించుట నాకసాధ్యముగఁ దోఁచుచున్నది. అనఁగా నవి బ్రహ్మజ్ఞానమందుఁ బరజ్ఞానమని యపరజ్ఞానమని భేదము దెలుపవు. శంకరు లభిప్రాయపడినట్లు బ్రహ్మమునకు నీశ్వరునకు భేదమున్నట్టు లంగీకరింపవు. ప్రపంచము మిథ్యయను వాదమునకు వానియం దాధారము లేదు. శంకరుల వలె మోక్షమందు జీవాత్మపరమాత్మలకుఁ గేవలైక్యము ఘోషింపదు."

ఇందుఁజెప్పఁబడినవి శుష్క వేదాంతుల యభిప్రాయములు. శంకరులవారి యభిప్రాయ మింత గర్హ్యముగాదు.

చయనులవారు విష్ణుపురాణమును శ్రీ భాగవతమును దమ యద్వైత వాదమున కాధారముగ గ్రహించిరికదా. యీ క్రింది విషయములు వానిలో నున్న వేమో వారు దయ చేసి తెలుపఁ బ్రార్థితులు.

1. "సర్వవి శేషం నేతినేతీతి విహాయ యదవశిష్యతేత దద్వయంబ్రహ్మ" మహా. రత్నావళి.

అనఁగా సత్యము జ్ఞానము ఆనందము లోనగు విశేషణముల నన్నిటిని కాదుకాదని వదలిపెట్టఁగా మిగిలిన దద్వైత బ్రహ్మమని మీరు చెప్పెదరుకదా.

నిర్విశేషం స్వయంభాత'మని శూన్యవాదులును మీవలెనే చెప్పెదరుకదా. మాయావాదులైన మీకు శూన్యవాదులైన బౌద్ధులకు నేమి భేదము? ఇట్టి భేదము మీఁది పురాణంబులఁ గలదా. అంకెల నన్నిటిని నిరాకరించిన సున్నయెట్లు మిగులునో సత్యము, జ్ఞానము, ఆనందము లోనగు గుణముల విడిచిన మిగులునది శూన్యమేకదా. శూన్యవాదులు నిర్వంచనముగ స్పష్టముగ బహిరంగముగ శూన్యోహ మనుచున్నారు. మాయా వాదులగుటచే నద్వైతులు దానినే సోహమ్మనుచున్నారు. నేనే బ్రహ్మమనువాఁ డెవనియందు భక్తిగలవాఁడు కాఁగలఁడు.

2. బ్రహ్మ విష్ణు శివులు మిథ్యలను మహావాక్య రత్నావళీ శ్లోక మిదివఱకే యుదాహరింపఁబడెను గదా. గౌడపాద కారికలు 2-23 టీకయందు "త్రిశూలాది ధారీ మహేశ్వరశ్చక్రాది ధారీవా పరమార్థో భవతీ త్యాగమికాః తదపిభ్రాంతి మాత్రం" త్రిశూలాదులు ధరించిన మహేశ్వరుఁడుగాని చక్రాదులు ధరించిన విష్ణువుగాని పరమార్థమని యాగమికులు చెప్పుదురు. అదియును గేవల భ్రాంతియే. అని యున్నది కదా. శ్రీవిష్ణుపురాణ భాగవతము లిట్లేచెప్పుచున్నవా?

3. శూన్యవాదులు మాయావాదులు చెప్పునట్లు జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము. తెలిసికొను వాఁడు, జ్ఞానము, తెలియఁబడువాఁడు మిథ్యలని యా పురాణములు చెప్పుచున్నవా.

4. శూన్యవాదులవలె శుష్క వేదాంతులును ప్రపంచముకుందేటికొమ్ము గొడ్రాలి కొడకువంటిదని చెప్పుచున్నారుగదా శ్రీభాగవత విష్ణుపురాణము లట్లు చెప్పుచున్నవా?

5. శ్రీభాగవత విష్ణుపురాణములు సమాధియందైనను భగవంతునాకారము ధ్యానింపుమని బోధించు చున్నవా? లేక "బ్రహ్మైవాహంచిదేవాహ, మేవంవాపి నచింతయేత్" బ్రహ్మమే నేను, చిత్తేనేను అనికూడ ధ్యానింపవలదని

బోధించుచున్నవా?

6. సర్వవేదాంత సిద్ధాంత సారంవచ్మియథార్థతః। స్వయంమృత్వా, స్వయం భూత్వాస్వయమేవా వశిష్యతే ॥ మ. రత్నా. సర్వవేదాంత సిద్ధాంతసారము యథార్థముగఁ జెప్పుచున్నాను. తానేచచ్చును తానే పుట్టును తానేమిగులును అని యద్వైత గ్రంథములు చెప్పుచున్నవిగదా! శ్రీవిష్ణుపురాణ భాగవంతములిట్లు చెప్పుచున్నవా? ఇది శూన్యవాది మతముగాదా?

7. స్వప్న జాగరితే స్థానేహ్యేక మాహు ర్మనీషిణః। భేదానాం హి సమ త్వేన ప్రసిద్ధే నైవహేతునా ॥ గౌడ. కారి. 2-5. దీనిపై శంకరులు

స్వప్న జాగరితస్థాన యో రేకమాహు ర్వివేకినః"

స్వప్నదశ జాగ్రద్దశ రెండు నొకటియే యని వివేకులందురు. అనియు

ఆనందగిరి

**స్వప్నవ జ్జాగరితస్య మిథ్యాత్వే స్వప్ననిద్రా యాతావి**
**త్యాదౌ జాగరితే స్వప్న శబ్దప్రయోగో యుక్తోభవతీత్యాహ**
**స్వప్నేతి ఉభయత్రైకత్వం విద్వదభిమత మిత్యత్రహేతుమాహ ॥**

ఈ వాక్యములు శూన్యవాదులు స్వప్న దశవలెనే జాగ్రద్దశ మిథ్యయని చెప్పునట్లు చెప్పుచున్నవి గదా. ఈ ప్రకారము శ్రీవిష్ణుపురాణ భాగవతములు చెప్పుచున్నవా?

8. **స్వతోవా పరతోవాపి, నకించిద్వస్తు జాయతే**
**సదసత్సదసద్వాపి, నకించి ద్వస్తుజాయతే ॥** **గౌడపాద. కా. 4-12.**

ఒక వస్తువువలన నటువంటి మఱియొక వస్తువు పుట్టదు. ఒక వస్తువువలన వేఱొకవిధమైన వస్తువు పుట్టదు. అట్టులే సత్తుగాని యసత్తుగాని సదసత్తుగాని పుట్టదు. అని గౌడపాదుఁడు చెప్పినట్లు శ్రీభాగవత విష్ణుపురాణములు చెప్పుచున్నవా?

9. ఆపురాణము లుత్తమ బ్రహ్మమని యధమ బ్రహ్మమని రెండువిధముల బ్రహ్మములను జెప్పుచున్నవా?

10. సత్త్వంతు ద్వివిధం ప్రోక్తం సాంవృతం పారమార్థికమ్। సాంవృత్తం వ్యావహారం స్యాత్। నివృత్తౌ పారమార్థికమ్ ॥ మాధ్య కారిక.

అని శూన్యవాదులవలె నద్వైతులు చెప్పు వ్యావహారిక సత్యమని పారమార్థిక సత్యమని యా పురాణములు చెప్పుచున్నవా?

11. విశ్వాకారంచ సంవృత్యాయస్యతత్ పదమక్షయమ్" అని శూన్యవాదులు చెప్పునటులు అవిద్యాధ్యాసమువలన జగత్సృష్టియని యద్వైతులందురుగదా శ్రీభాగవత విష్ణుపురాణాదు లిట్లు చెప్పుచున్నవా?

12. భావార్థ ప్రతియోగిత్వం, భావత్వం వా నతత్త్వతః। నాస్యసత్త్వ మసత్యం వా నదోషో గుణఏవచ। హేయోపాదేయరహితం తచ్ఛూన్యం పదమక్షయమ్ ॥

భావము అభావము సత్త్వ మసత్త్వము దోషము గుణము హేయ ముపాదేయము శూన్యమునందుఁ గాల్పనికములే కాని పరమార్థములు కావని శూన్యవాదులు చెప్పునట్లు అద్వైతులు చెప్పెదరుగదా. ఆ రెండు పురాణము లిట్లు చెప్పుచున్నవా?

13. అవాచ్య సర్వశబ్దైస్త ల్లక్ష్యతే ఖలైః పదైః అని శూన్యవాదులు శూన్యమని యని ర్వాచ్యమని చెప్పు విధమున నద్వైతులు చెప్పుచున్నారుగదా యారెండు పురాణము లిట్లుచెప్పుచున్నవా?

14. వేదా ఇతిచవేద విదో యజ్ఞా ఇతి చ తద్విదః గౌడ. కారిక. 2-22.

ఋగ్వేదాదయోవేదాః చత్వారస్త త్వానీతి పాఠకావదంతి తదపికల్పనా మాత్రం; జ్యోతిష్టోమాదయో యజ్ఞవస్తుభూతా భవంతీతి బోధాయన ప్రభృయో యాజ్ఞకామన్యంతే ॥ ఆనందగిరి.

వేదములు, యజ్ఞములు కల్పనలేకాని సత్యములుగావని గౌడపాదాదులు చెప్పిరిగదా. ఆ రెండు పురాణములు నిట్లు చెప్పుచున్నవా?

ఇట్టి వింకను గలవు. శూన్యవాదులవలె మాయావాదులగు నద్వైతులు పురాణములకు విరుద్ధముగఁ జెప్పుచున్నవి తమకుఁ బ్రమాణములనుట వాడ వదినె తనకు సావిత్రీ చరిత్ర ప్రమాణ మనుట వంటిదిగదా.

మాయావాద శూన్యవాదసామ్య మింకను దెలియఁగోరువారు బృహదారణ్యకోపనిషత్తు 4-3-10 మంత్రమునకుఁ (నతత్రరథేత్యాది) మధ్వాచార్యులవారు వ్రాసిన వ్యాఖ్యానముఁ దిలకింపఁ బ్రార్థితులు.

అద్వైతవాదము సత్యమా యసత్యమా యని విమర్శించుట పండిత కార్యము గాని సంజీవనీ కార్యము గాదు. ఆ మార్గ మద్వైతి సన్న్యాసులకు మాత్రమేయని శంకరులుబోధించిరి. కర్మాసక్తులకు బుద్ధిభేదము గలిగింపవలదని భగవద్గీతలందు భగవంతుఁడు బోధించెను. ఈ రెండు శాసనములను తుంగలలోఁ ద్రొక్కి సంసారుల నిహమందుఁ బరమందుఁ గూడఁ జెఱుచు దుర్బోధములు చేయు రాక్షసకృత్యములు మానుదురుగాక! యనియే శుష్కవేదాంతులకు సంజీవని చేయు విన్నపము. ఈ విషయమునఁదప్ప సంజీవని కేవిషయమందును బట్టుదలలేదు.

సంజీవని యద్వైతమును ఖండింప దాడివెడలినదను చయనులవారి యభిప్రాయము తప్పు, అది వ్యర్థకార్య మని ప్రథమ విజ్ఞప్తియందే చెప్పఁబడెను. ఆ వాదము సామాన్యలోకమును బాగుపఱుచట నమ్మరాని విషయమేకాని చెఱుచుట సత్యము. సన్న్యాసులు శూన్యవాదులయినను నాస్తికులైనను సంజీవని శోకింపదు. తామనధికారులయ్యు ననధికారులకు కొందఱు శుష్కవేదాంతములు బోధించుట వీనులారవిని, దానివలనఁ గొందఱు చెడుట కన్నులారఁగని, యిది యసహ్యమగుటవలన లోకహితముఁ గోరి శూన్యవాదుల గు శుష్క వేదాంతులపై సంజీవని దాడివెడలుట సత్యము. అద్వైత శుష్కవేదాంత సిద్ధాంత సంసారులకా వెఱ్ఱిమొఱ్ఱులు చెప్పకుండవలెను. రహస్యము బూర్కాలడ్డని చిదంబర రహస్యమని కొందఱ యభిప్రాయము. కావున ఆ రహస్యమున్నదున్నట్లు చెప్పినఁ గొందఱైనఁ జెడిపోక బాగుపడుదురని నోరారరఁ జెప్పవలసివచ్చినది చేయార వ్రాయవలసివచ్చినది. కావున సంజీవని తమ యద్వైతమును ఖండింపలేదనియు దాని విశ్వరూపము నున్నదున్నట్లు సంజీవని లోకహితమునకుఁ గనఁబఱుచు చున్నదనియుఁ జయనుల వారెఱుఁగుదురు గాక! యని విన్నవించుచు నింతతో విరమించుచున్నాను.

**భక్తి సంజీవని.**

శ్రీరామచంద్రాయనమః
శ్రీశంకరాచార్యమతసిద్ధాంసారము.

## శ్రీశంకరమతప్రకారము.

1. నిశ్రేయసకాములని, అభ్యుదయ కాములని లోకులు రెండుతెగలు.

2 నిశ్రేయసకాము లనఁగా సర్వకర్మములను స్వరూపముతోనే వదలి పరమహంస పరివ్రాజకులై మెక్షము నందు మాత్రమే యిచ్ఛగల బ్రాహ్మణులు. వీరే ముముక్షువులు.

3. అభ్యుదయకాములనఁగా సంసార సుఖాసక్తులు. వీరే బుభుక్షువులు. సంసారులు.

4. ఈ యిరువురమార్గములు పరస్పర భిన్నములు. మొదటి దానికి రెండవదానికిఁ గొండకు నావగింజకుఁ గల తారతమ్మము గలదు. ఒకటి తూర్పు సముద్రమునకుఁ బోవుమార్గమువంటిది. రెండవది పడమటి సముద్రమునకుఁ బోవు మార్గమువంటిది. కావున నొక సముద్రమునకుఁ బోవ నిచ్ఛగలవారు రెండవ సముద్ర మార్గమున నడుపరానట్లు సన్న్యాసులు సంసారులవలెఁ గాని సంసారులు సన్న్యాసులవలెఁ గాని నడువరాదు.

5. ముముక్షువులకు నద్వైతజ్ఞాతజ్ఞాననిష్ఠ మార్గము. వీరు సర్వకర్మ సన్న్యాసులై- సాధన చతుష్టయ సంపన్నులై అద్వైత జ్ఞానమును బోధించు అహంబ్రహ్మాస్మి- తత్త్వమసి- సోహమ్- ఇత్యాది మహావాక్యములను జాతీచే బ్రాహ్మణులయియుండిన పరమహంస పరివ్రాజకులయొద్దనే శ్రవణాదులు గావింప నధికారులగుదురు. వీరు మాత్రమే సద్యోముక్తి కధికారులు. అట్లు పరమహంస పరివ్రాజకు లగువఱకు నెవ్వరైనను మహావాక్యములు వినరాదు. అనరాదు. అట్లెవరైనఁ జేసిరేని వారు నిస్సందేహముగ నాస్తికులు. వారంత్యజుల వలె దూరమున నుంచఁబడవలసినవారు. వారినాలుక తెగఁగోయవలయును. అని యద్వైతగ్రంథములు చెప్పుచున్నవి. కావున వారు స్పృశ్యులుగారు, పాంక్తేయులుగారు, శూద్రులైనను ఇట్టి బ్రాహ్మణులు చేతి నీరు ద్రాగరాదు. హవ్యకవ్యములకు దానప్రతిగ్రహములకు వీరు యోగ్యులుగారు.

6. బుభుక్షువులకు శ్రేయస్కర మార్గములు నిష్కామ కర్మ- భక్తి- ప్రపత్తులు.

7. తమకుఁ బూర్వమందేయుండిన- వైష్ణవము- శైవము- శాక్తేయము- గాణాపత్యము- సౌరము నను నైదుమతములకుఁ దోడు తమ యద్వైతమతము నొకదానిని జేర్చి మతముల నాఱుస్థాపించి షణ్మతో ద్ధారకులని శ్రీశంకరాచార్యులు ప్రసిద్ధిగాంచిరి. అందుఁ గేవల విష్ణునందు ననన్యభక్తి గలవారు వైష్ణవులు. కేవల శివునందు ననన్యభక్తిగలవారు శైవులు. శక్తి నుపాసించువారు శాక్తేయులు. గణపతి యుపాసకులు గాణాపత్యులు. సూర్యోపాసకులు సౌరులు. ఈ యైదుగురు భక్తిమార్గనిష్ఠులే. ఆయాదేవతల ననన్యభక్తి నుపాసించువా రాయా దేవతల లోకములకుఁబోదురు. ఇందు వాసుదేవభక్తిగల వైష్ణవులు క్రమముక్తి కధికారులనియు, ఈ యైదు మతములవారు వారి వారి సంప్రదాయ మతగ్రంథముల ప్రకారముగ భక్తి ప్రపత్తుల ననుష్ఠింప వలయుననియు శంకరాభిప్రాయము కావున నీ మతానుష్ఠాన విషయములగు ప్రకరణ గ్రంథములను శంకరాచార్యులవారు వేఱుగ వ్రాయరైరి. ఇందు శంకరాచార్యులవారి యనుష్ఠానము వైష్ణవాను ష్ఠానమే. ఈ యైదుగురయందు ద్వైతభావమే ద్వైతానుష్ఠానమే కాని శంకరాద్వైత మతభావము లేదు. ఉపాసకుఁడు ఉపాస్యుఁడు (ఉ పాసించువాఁడు, ఉపాసింపఁబడువాఁడు) అను భేదభావము వీరియందుఁ గలదు. వీరిలోఁ గొందఱు తా మద్వైతులమని చెప్పుకొందురు గాని యద్వైత శబ్దమునకు వీరు చెప్పెడి యర్థమునకు శంకరాద్వైతులు చెప్పెడు నర్థమునకు భేదముగలదు.

8. వేషభాషల మాత్రమునఁగాక నేనే బ్రహ్మమను దృఢనిష్ఠగల పరమహంస పరివ్రాజకులు మాత్రమే వాస్తవ శాంకరాద్వైతులు. వీరికి చక్రాది చిహ్నముల ధరించునధికారము లేదని శంకరులు నిషేధించిరి.

9. తక్కిన యామతస్థుల మనుకొనువారియందు నద్వైతి శబ్దము నేతి బీరకాయ కర్పూరపు చక్ర కేళి పుణ్యజన శబ్దములవంటిది. వీరు తా మద్వైతులమని మాట చెప్పుకొన్నంత మాత్రమున వీరికి వాస్తవాద్వై తులకు వచ్చు మోక్షఫలమురాదు. వీరందఱు వాస్తవమున ననుష్ఠానమున విశిష్టాద్వైతులే కాని శాంకరాద్వైతులు గారు. కావున వీరిలో శివభక్తిగలవారు శైవదీక్ష వహించి శివలోకవాసులు కావలయును. విష్ణుభక్తిగల వారు చక్రశంఖోర్ధ్వ పుండ్రాదుల ధరించి పంచసంస్కారపరులై ముక్తులు గావలయును. వీరిరువురు విశిష్టా ద్వైతులే. శాక్తేయులు జీవించి యుండువఱకు విశిష్టాద్వైతులే. ఇటుచేయక ద్వైతమందు మునిఁగియు మేమద్వైతులమని, జ్ఞానులమని చెప్పుకొనువా రుభయభ్రష్టులై చెడవలయును. చక్రాదితత్తద్దేవతా చిహ్నధారణ నిషేధము వాస్తవాద్వైతులైన పరమహంస పరివ్రాజకుల విషయమేకాని తన్నామ మాత్రధారులగు తక్కినవారి విషయము కాదు కావున నుపాసకు లందఱు వారివారి సంప్రదాయాను సారముగ సంస్కారులై యిష్టదేవతా చిహ్నముల ధరించి యేకభక్తి పరులై తరింపవలయును.

10. ఈ యైదు మతములవారికి నేకేష్ట దేవతాభక్తియే ఫలప్రదము గాని బహుదేవతాభక్తి ప్రశస్తము గాదు.

ఫలవంతమునుగాదు సాధ్యముగాదు. ఆఱవ మతమువారైన యద్వైతులు దామే నిర్గుణ నిరాకార నిర్వికార క్రియాశూన్య శూన్యప్రాయ బ్రహ్మమని తక్కిన సర్వము మిథ్యయని తలంతురుగావున వారికి వేఱొక దేవుఁడు లేఁడు భక్తిలేదు. కర్మమునులేదు.

11. శ్రీశంకరాచార్యులును శ్రీరామానుజ శ్రీమధ్వాచార్యులవలె విష్ణువునకుఁ బరత్వముచెప్పిన విష్ణుభక్తుఁడు కానవారి మతమువారమని వారి శిష్యప్రశిష్యుల మని చెప్పుకొనువారందఱు గురువాక్యభక్తు లైరేని త్రికరణ శుద్ధిగలవారై రేని వారివలె నివృత్తిమార్గస్థులై రేని పరమహంసలైనఁ గావలయును. లేక ప్రవృత్తిమార్గ నిష్ఠులైరేని స్త్రీలు పురుషులు సర్వవర్ణములవారు సంస్కారులై విష్ణుభక్తిగలవారై వైష్ణవధర్మైకనిష్ఠులు కావలయును. గురువులమార్గ మనుష్ఠింపక తద్బోధమునకు విరుద్ధముగ వర్తించువారు గురుద్రోహు లనఁబడుదురు. వీరే మతరండలనఁబడుదురు. ఒక మతానుష్ఠానము గలిగి వేఱొక మతమువారమను వారు మతరండలు.

12. పరమభక్తులకుఁ బ్రపన్నులకు సర్వవర్ణములవారికి స్త్రీలకుఁ బురుషులకు సద్యోముక్తి యీ జన్మమందే భగవదనుగ్రహమునఁ దప్పక లభించునని భక్తిమత గ్రంథములు శ్రీ రామాయణ, భారత, భాగవత, విష్ణుపురాణ, మహానారాయ ణోపనిషదాదులు చెప్పుచున్నవి. కావున శుష్క వేదాంతులు బోధచేఁ జెడక తమ శ్రేయస్సు గోరినవా రాయామతములు యాయా దేవతలు నుపాసించి యా యామత సంప్రదాయమను సరించి సంస్కారులై సదాచారసంపన్నులై, స్వధర్మనిష్ఠులై వర్తింపవలెను. ఆ మతమువార మీ మతము వారమని దురభిమానము మాత్రము వహించి ప్రగల్భములాడి యనుష్ఠానము లేమిని చెడక యందురుగాక. తామద్వైతులమని చెప్పుకొనుచు నద్వైతమును బోధించు శాస్త్రము లెట్టినిష్ఠ నద్వైతమను చున్నదో యెట్టివా రద్వైతు లనఁబడుచున్నారో యెఱుఁగక స్వేచ్ఛగా వర్తించువా రెట్టిభ్రష్టులో యట్టులే యూర్ధ్వపుండ్రధారణమాత్రమునఁ దమది వైష్ణవసంప్రదాయమని, భస్మధారణమాత్రమునఁ దమది శైవసంప్రదాయమని తలఁచువారును నట్టి భ్రష్టులే. వీరు గబ్బిల మతములోఁ జేరినవారు. కొందఱు మూఢాగ్రేసర చక్రవర్తులు మాయందు భక్తియుండినఁ జాలును. మేమెట్లు వర్తించిన నేమియనుచున్నారు.

దీనికి గాఢాజ్ఞానము కారణము. భక్తి యనుష్ఠానమునకు శాస్త్రముగలదుగాని లేకపోలేదు. పరమభక్తి కుదుటఁబడిన వారుమాత్రము శాస్త్రవిధానమును గైంకర్యమున కావశ్యకమైనపు డుల్లంఘించినను దోషము లేదు. తక్కినవారందఱు భక్తిశాస్త్రము ననుసరించి వర్తింపరేని భక్తులుగారు. భక్తిఫలింపదు. రాజు నందెంత ప్రీతిగలవాఁడైనను రాజాజ్ఞమీఱి వర్తించువాఁడు రాజభక్తుఁడుగాఁడు.

భగవద్గీత 16-23వ శ్లోకమున నెంతటి శ్రద్ధగలవారైరను శాస్త్రవిధానమనుసరింపక వారివారి యిష్టప్రకారము వర్తించువారి కైహికసుఖము లేదు, స్వర్గములేదు, మోక్షములేదు. అని స్పష్టముగఁ జెప్పఁబడినది. కావున నింతకంటె నధమగతులకుఁ బోవనిష్టములేని మనుష్యులు, స్త్రీలు, పురుషులు వారివారి కిష్టమైన మతమేదో శాస్త్రము ప్రకారము దాని యనుష్ఠానమెట్టిదో యెఱిఁగి యాప్రకారము సంస్కారులై వర్తించి మఱుజన్మంబున నింతకంటె నున్నతదశకుఁ బోవుటో లేక యింతమాత్రమైన దక్కించు కొనుటో యేదియో యొకటి సాధింతురుగాక! మనుష్యజన్మము దుర్లభము. దానిని వ్యర్థపఱువక, యన్యమత దేవతాద్వేషముమాని, తమ మనుష్యజన్మము వ్యర్థముచేసి పశుపక్ష్యాద్యధో లోకములకుఁబోక, సంస్కారులై భక్తిపరులైకాని ప్రపన్నులైకాని సార్థకజన్ములై చరింతురుగాక! తరింతురుగాక!! లేక శూన్యమతులై శూన్య గతులై శూన్యవాదులై శూన్యమై చెడిపోదురుగాక!!!

వీనికిఁ బ్రమాణవాక్యములఁ గోరువారు 1933వ సం॥ భక్తిసంజీవనులఁ బఠంపఁ బ్రార్థితులు.

**భక్తిసంజీవని.**

**శ్రీరామ**




మందరము.

శ్రీసీతారామ పట్టాభిషేకము.

**శ్రీ సీతారాముల పరిపూర్ణ కరుణాకటాక్ష వీక్షా మృత ధారాపాతంబునను, కోలంకవీరవరము జమీందారు మ । రా । శ్రీ శ్రీ రాజారావు రామాయమ్మరావు బహదర్‌గా రనుగ్రహించి** కలిగించిన యానుకూల్య సౌకర్యములవలనను మందరమున శ్రీ సీతారామ చంద్ర పట్టాభిషేకము శ్రీముఖ సం॥ మాఖ శు చతుర్థినాఁటికి పూర్ణమగును. ఆనాఁడు 19-1-34 వాసుదాసు గారి మూఁడాశ్రమములందును శ్రీ శ్రీ రాజాఅమ్మగారి పేర శ్రీ సీతారాముల కభిషేకోత్సవములు నన్నదానములు జరుప నాయా ట్రస్టీలు ప్రార్థింపఁబడుచున్నారు. సమాజసభ్యులు వారివారి గ్రామములందో గృహములందో శ్రీ సీతారాములకు యథాశక్తి యర్చనాదులు జరగించి సాధ్యమైనంత వఱకు బీదల కన్నదానము చేయఁ బ్రార్థింపఁబడుచున్నారు.

లక్ష్మీ నరసాపురము,
1-1-34.

**ఇట్లు విన్నవించు,**
**మందర కార్యనిర్వాహకులు.**